వార్త
ఆదివారం
26 మే, 2024

# ఋతు 'విలాపం'..





# 'ఇండియన్ 2' జులైలో విడుదల?

యూనివర్సల్ స్టార్ హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ షణ్ముగం 'ఇండియన్ 2' చిత్రం కోసం మరోసారి జత కట్టారు. ఈ చిత్రం ఇండియన్(భారతీయుడు) చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కుతోంది. ఇందులో కాజల్ అగర్వాల్ కీలక పాత్ర పోషిస్తోంది. జూన్‌లో విడుదల కావాల్సిన ఈ సినిమా జులైలో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. కమల్‌హాసన్, కాజల్ అగర్వాల్‌తో పాటు సిద్ధార్థ్, బాబీ సింహా, రకుల్‌ప్రీత్ సింగ్, ప్రియా భవాని శంకర్, సముద్రఖని మొదలైనవారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీత దర్శకుడుగా, లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.

## తారాతీరం

# విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా మరోసారి!

విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం విడి14. విజయ్‌తో గతంలో 'టాక్సీవాలా' అనే చిత్రాన్ని డైరెక్ట్ చేసిన రాహుల్ ఇప్పుడు ఈ సినిమాను రూపొందిస్తున్నారు. తాజా సమాచారం ఏమిటంటే విజయ్ దేవరకొండ జోడీగా రష్మిక మందన్న నటించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం గురించి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఇప్పటికే 'డియర్ కామ్రేడ్', 'గీత గోవిందం' చిత్రాల్లో వీరిద్దరూ కలిసి నటించారు. ఇది వారికి హ్యాట్రిక్ చిత్రం అని చెప్పవచ్చు. అక్టోబర్‌లో సెట్స్ పైకి వెళ్లనున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నట్లు సమాచారం. తెలుగుతో పాటు హిందీ, కన్నడ, తమిళం, మలయాళం భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.



ఆదివారం వార్త

26 మే, 2024

## మంచి ముత్యాలు

అందమైనదేనినీ పోటీ ద్వారా నిర్మించలేనట్లే,
గర్వంతో ఉన్నతమైన పనులేవీ చేయలేము.

- జాన్ రస్కిన్

## విషయ విశేషం


జాలువారే కర్టెన్లు... 4

'సంఘీ'భావం....5
అకాల వర్షాలతో అన్నదాత విలవిల

కవర్ స్టోరీ..6
రుతు 'విలాపం'..

రైతు పంట చల్లగా...11

ఈవారం కవిత్వం..12
భువిని దివిని చేద్దాం

చెదిరిపోని నవ్వుకోసం...14

ఉడుపి హోటల్ ప్రసిద్ధి...18

కథ.. 20
ఒక్కడుగు

సాహిత్యం..23
జనంలోకి తెలుగుమాట

వ్రతం..25

ఆకట్టుకునే కట్టడాలు...26

ఎన్ని ద్వారాలు ఉండాలి?..29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### గుండెపోటు



ఛాతీలో నొప్పని వైద్యుల దగ్గర కెళితే డాక్టర్లు ముందుగా ఈసీజీ తీయిస్తున్నారు. అందులో ఏదైనా తేడా వస్తే వెంటనే బ్లడ్ టెస్ట్‌లూ, ఇతర పరీక్షలూ చేయించి ఓ నిర్ణయానికి వస్తున్నారు. ఈ రక్తపరీక్షలు ఎంత వేగంగా చేస్తే అంతమంచిది. ఎందుకంటే గుండెపోటు వచ్చినప్పుడు దీనికి పట్టే ఆ కాస్త సమయం కూడా పెద్ద ఆలస్యం కిందే లెక్క. ఆ సమయాన్ని కూడా తగ్గించేందుకే సరికొత్త కృత్రిమ మేధ(ఏఐ)ని ఆవిష్కరించారు తైవాన్ శాస్త్రవేత్తలు. ఇందుకోసం 4.5 లక్షల ఈసీజీ షీట్‌లతో దానికి శిక్షణ అందించారు. గుండెపోటులో చనిపోయినవాళ్ల 'రిస్క్ ఫ్యాక్టర్స్'పైన పూర్తి అవగాహన కల్పించారు. ఆ రిస్క్ ఫ్యాక్టర్స్‌ని ఏఐ వివిధ 'పర్సంటైల్'లుగా విభజించుకుంది. 95శాతం పర్సంటైల్ దాటినప్పుడు డాక్టర్‌ని హెచ్చరించడం కూడా నేర్చుకుంది. దీన్ని తైవాన్‌కి చెందిన రెండు ఆసుపత్రుల్లో చికిత్సకి వచ్చిన 16వందలమంది రోగులపైన పరీక్షిస్తే ఏకంగా 30శాతం మరణాలని తగ్గించిందట ఏఐ. ఓ కొత్త ఆవిష్కరణ-అదీ ఓ ఔషధేతర పరికరం ఇంత చక్కటి ఫలితం చూపడం వైద్యచరిత్రలో ఓ అద్భుతమనే చెబుతున్నారు శాస్త్రవేత్తలు. తైవాన్‌లోని నేషనల్ డిఫెన్స్ మెడికల్ సెంటర్ వాళ్లు ఆవిష్కరించిన ఈ ఏఐని ఇప్పటికే 14సైనిక ఆసుపత్రుల్లో ఉపయోగించడం మొదలు పెట్టారు.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com





# జాలువారే కర్టెన్లు



**కిటికీలకు** వేలాడదీసే కర్టెన్లదేముందీ..కాస్త కొత్త డిజైనూ, రంగూ చూసి ఎంచుకుంటే సరిపోతుందని ఎవరూ అనుకోవడంలేదిప్పుడు. సీజన్‌ను బట్టి వాటినీ మార్చేస్తున్నారు. ఇక, పండుగలకూ ప్రత్యేక వేడుకలకూ మెరిసిపోయేలా గ్లిట్టర్ అనీ, షీర్ అనీ, షిల్క్ అనీ.. ప్రత్యేకమైన వాటిని ఎంచుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. మొత్తంగా సందర్భాన్ని బట్టి ఎప్పటికప్పుడు వీటిల్లోనూ కొత్తవి ఉండేలా చూసుకుంటున్నావారే ఎక్కువ. వినియోగదారుల అభిరుచుల్నీ, ఆసక్తుల్నీ గుర్తించి నిపుణులూ ఎప్పటికప్పుడు పరదాల డిజైన్లలోనూ ప్రయోగాలు చేస్తున్నారు. ఆ ప్రయోగాల్లో భాగంగా తాజాగా తీసుకొచ్చినవే ఈ మాయాపర దాలు. 'ల్యాండ్‌స్కేప్ బ్లాక్‌అవుట్ కర్టెన్స్ త్రూ ద విండోస్' పేరుతో వచ్చేస్తున్న ఇవి దూరం నుంచి చూసినవాళ్లకు కిటికీల్లా కనిపిస్తాయి. కానీ నిజానికి కర్టెన్లే..పరదాల్లో కొత్తగా వచ్చేస్తున్న ఈ మోడళ్లకు ప్రకృతి అందాలు కూడా తోడవడంతో...ఇప్పుడు ఎక్కువమంది వీటిని ఎంచుకునేందుకు ఇష్టపడతున్నారు.

### ఆకట్టుకునే డిజైన్లలో

పరదాలపైన ప్రకృతి అందాలు ఉండి..అవి త్రీడీలుక్‌తో రావడం అనేది ఎప్పటినుంచో ఉన్నవే. అయితే..ఆ పరదాలకే కిటికీ డిజైన్‌నూ జతచేయడంతో వీటిని మొదటిసారి చూసినవాళ్లెవరైనా ఇది కిటికీనా లేదా పరదానా అంటూ ఒక్కక్షణం సందేహించడం ఖాయం. నాణ్యమైన పాలిస్టర్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన ఈ పరదాలకు కిటికీ లుక్‌ను తెచ్చేందుకు అక్కడక్కడా కాస్త మందంగా ఉండే వస్త్రాన్ని ఎంచుకుంటారట. ప్యానెల్ల తరహాలో కనిపించే ఈ కర్టెన్లు ఎండనూ, అతినీలలోహిత కిరణాలనూ దాదాపు ఎనభైశాతం ఇంట్లోకి రాకుండా అడ్డుకుంటాయని అంటున్నారు తయారీదారులు. ముడతలు పడకుండా ఉండేలా, ఎక్కువకాలం మన్నేవిధంగా రూపొందించిన వీటిని చల్లని నీటిలో బ్లీచ్ వాడకుండా ఉతికితే సరిపోతుంది. ఇన్ని జాగ్రత్తలు తీసుకుని ఆవిష్కరించిన ఈ కర్టెన్లూ..జాలువారే జలపాతాలతో, వసంతాన్ని తలపించే పూలచెట్లతో, కురిసీ కురియనట్లుగా కనిపించే మంచుచిత్రాలతో, అడవి అందాలతో ఇలా ఒకటేమిటి, కోరుకున్న ప్రకృతి డిజైన్లతో అందుబాటులో ఉన్నాయి.





## 'సంఘీ' భావం



# అకాల వర్షాలతో అన్నదాత విలవిల

అన్నదాతకు అకాల వర్షాలు శాపంగా పరిణమించాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట సరిగ్గా చేతికి అందేసమయంలో అకాల వర్షాలు పిడుగుపాటుగా మారాయి. గత రెండు మూడు దశాబ్దాలుగా వ్యవసాయం గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రతి సీజన్‌లో ఏదో ఒక ఉపద్రవం రైతన్నలను వెంటాడుతోంది. దీనితో అన్నదాతలు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఒక సీజన్‌లో వచ్చిన నష్టాన్ని మరో సీజన్‌లో సర్దుబాటు చేసుకోవచ్చని భావించే రైతుల ఆశలు నెరవేరడం లేదు. దీనితో ప్రతి ఏటా అప్పులు పెరిగి కనీసం వడ్డీలు కూడా కట్టలేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం తీసుకునే చర్యలు కేవలం కన్నీరు తుడిచే ప్రాయంగా కూడా లేకపోవడంతో ఉండకపోవడంతో వారి బాధ వర్ణనాతీతంగా ఉంటోంది. ఈసారి సీజన్‌లో రైతులకు రెండు విధాలుగా ప్రకృతి విరుచుకుపడింది. ముందుగా మార్చి మొదటి వారంలో వడగళ్లతో కూడిన వానలు పడ్డాయి. దీనితో సుమారు 30 నుంచి 40 శాతం పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. వెంటనే ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని ఎమ్మెల్యేలు, ఎంపీలు హామీలు ఇచ్చారు. అయితే పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో రాజకీయ నేతలు అంతా పార్టీ పనుల్లో బిజీ అయిపోయారు. దీనితో రైతుల గోడు వినేవారు లేకుండాపోయారు. వడగళ్ల వానకు దెబ్బతినగా మిగిలిన పంటనైనా దక్కించుకోవచ్చని రైతులు అభిప్రాయపడ్డారు. అయితే అనూహ్య రీతిలో కుండపోత వర్షాలు కురవడం ప్రారంభించాయి. దీనితో మిగిలిన పంట కూడా చేతికి రాకుండా పోయింది. రాష్ట్రం వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట నష్టం కలిగింది. రాష్ట్రంలో నారాయణపేట, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, జనగామ, సిద్ధిపేట కరీంనగర్, మెదక్, సిద్ధిపేట, రంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పంట నష్టం కలిగిందని అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. మహబూబాబాద్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ములుగు, పెద్దపల్లి, వనపర్తి, జగిత్యాల జిల్లాల్లో కూడా భారీగానే పంట నష్టం కలిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెద్ద మొత్తంలో పంట నష్టం వాటిల్లింది. ముఖ్యంగా ఉద్యానవన, వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. రాయలసీమలో అరటి,మామిడి తోటలు బాగా దెబ్బతిన్నాయి. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు తోడు బలమైన ఈదరు గాలులు వీయడంతో చెట్టు నేలకొరిగాయి. ముఖ్యంగా రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు, వాల్మీకిపురం తదితర ప్రాంతాల్లో మామిడి చెట్టు దెబ్బతిన్నాయి. మామిడి పండ్లు, కాయలు నేలరాలడంతో మార్కెట్‌కు తరలించలేని పరిస్థితి ఏర్పడింది. నిమ్మనపల్లి, కురబలకోట, గుర్రంకొండ ప్రాంతాల్లో బొప్పాయి చెట్లు అరటి చెట్లు దెబ్బతిన్నాయి. రాయలసీమలో టమోటా పంట వేలాది ఎకరాల్లో సాగుచేస్తున్నారు. టమోటా పిందెలు నేలరాలిపోయడంతో పంట చేతికి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతి సీజన్‌లోను రైతులు ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటున్నారు. నాసిరకం విత్తనాలు పెద్దసంఖ్యలో మార్కెట్‌లో విక్రయిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తయారీదారుల హామీలను నమ్మిన రైతులు ఆయా విత్తనాలు వేసి పంట కనీసం మొలకెత్తకపోవడంతో లబోదిబోమంటున్నారు. వ్యవసాయ శాఖలో చట్టాలు కఠినంగా లేకపోవడం అన్నదాతలకు శాపంగా మారింది. నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుల మందులు, కల్తీ ఎరువులు అమ్మి రైతులను మోసగిస్తున్న కొందరు వ్యాపారులకు చట్టాలు ఎలాంటి శిక్షలు విధించలేకపోతున్నాయి. దీనితో అక్రమార్కులు చట్టాలకు ఏమాత్రం భయపడకుండా రైతులను మోసగిస్తున్నారు. ముఖ్యంగా సీజన్‌లో రాష్ట్రానికి ఆనుకుని ఉన్న పొరుగు రాష్ట్రాల నుంచి కొందరు వ్యాపారులు రాష్ట్రంలోకి చొరబడి రైతులను మోసగించి వెళ్లిపోతున్నారు. రైతులు ఆందోళనలు చేస్తే రెండుమూడు రోజులు అధికారులు హడావిడి చేయడం ఒకరిద్దరు వ్యాపారులపై నామమాత్రపు కేసులు పెట్టి కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఈ కేసుల్లో చాలా వరకు స్టేషన్ బెయిల్ స్థాయిలో ఉండటంతో సాయంత్రానికి కల్లా అక్రమార్కులు స్టేషన్ నుంచి బయటపడుతున్నారు. నష్టపోయిన రైతులకు ఏ ఒక్కరూ ఆదుకునే పరిస్థితి కనిపించడం లేదు. చట్టాల్లో మార్పులు తీసుకురావాలని, కుట్రతో రైతులను మోసం చేస్తున్న వ్యాపారులకు కఠిన శిక్షలు వేయాలని రైతులు కోరుతున్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయంలోకి కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడంతో ప్రభుత్వాలు వారిని ప్రశ్నించే సాహసం చేయలేక పోతున్నాయి. అదేవిధంగా రైతులకు సరైన బీమా సౌకర్యం అందుబాటులో లేదు. ప్రిమియంలు కట్టడమే కాని నష్టపరిహారం మాత్రం లభించడం లేదు. అదేవిధంగా ప్రభుత్వం నుంచి సహకారం అంతంత మాత్రంగానే ఉంటోంది. రైతులు నష్టపోయినప్పుడు వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఆ తరువాత వారు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తున్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలకే ఎక్కువ సమయం పట్టడంతో సకాలంలో నివేదికలు ప్రభుత్వం వద్దకు చేరడం లేదు. ఒకవేళ అందినా ప్రభుత్వం త్వరితగతిన స్పందించడం లేదు. దీనితో రైతులు తాము నష్టపోయిన విషయాన్ని దిగమింగి మళ్లీ అప్పులు చేసి వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నారు. ప్రత్యేక చట్టాలను రూపకల్పన చేయడంతో పాటు, సకాలంలో రైతులకు నష్టపరిహారం అందిస్తే వ్యవసాయ రంగం పురోగమించే అవకాశం ఉంటుంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



# రుతు 'విలాపం'..


కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు


**సంవత్సరానికి మూడుకాలాలు ఆరు ఋతువులు. ఈ సంవత్సరకాలంలో ఏఏ ఋతువుల్లో వాతావరణం ఎలా ఉంటుంది అనేది మనకు తెలియంది కాదు. వర్షాకాలంలో వానలు ఎండాకాలంలో భానుడి భగభగలు శీతా కాలంలో చలిగాలులు ఇది ప్రకృతిసిద్ధంగా జరిగే ఋతుక్రమం. దీనిలో ఒక్కొక్కకాలం నాలుగు నెలలపాటు కొనసాగుతుంది. అయితే కాలగమనంలో ఈ ఋతువుల రాకలో నేడు అనూహ్యామైన మార్పులు సంభవిస్తున్నాయి. సంవత్సరానికి మూడుకాలాలు కొనసాగే ఈ ప్రకృతి సిద్ధ వాతావరణం రానురాను రెండు కాలాలుగా మిగిలిపోయే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.**

శీతా'కాలం' వెళ్లకుండానే భానుడు వచ్చేస్తున్నాడు. సాధారణంగా మహాశివరాత్రి నాటికి చలి శివశివ అంటూ వెళ్లిపోతుందని, ఆ తర్వాత నుంచి ఎండాకాలం మొదలవుతుంది పెద్దలు చెబుతూ ఉంటారు. కానీ వేసవికాలం మాత్రం రావాల్సిన సమయానికన్నా ముందే వచ్చేస్తోంది. జనవరి నెల పూర్తవకుండానే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. వర్షాకాలంలో చూస్తే కుండపోత లేదా ఒకటీ అరా చినుకే దక్కుతోంది. ఇక ఆ తరువాత శిశిరం. వేసవి కాలం పెరిగిపోవడం, వర్షాకాలం చిక్కిపోవడంతో శీతాకాలం శీతకన్ను వేస్తోంది. ఫలితంగా శీతాకాలంలో చలిఛాయలు పూర్తిగా రాకుండానే అది కాస్తా అంతర్ధానం అయిపోతూ ఉంది. ఇక మార్చి వస్తే..భానుడి భగభగలకు అందరూ మలమలా మాడిపోతారేమో అన్నట్లుంది పరిస్థితి.

ఎండాకాలం ఎండ వానాకాలం వాన ఇది ప్రకృతి సహజం. అప్పుడప్పుడూ వేసవిలోనూ చెదురుముదురు వానలు పడటమూ ఈదురుగాలులు రావడం కూడా సహజమే కానీ, ఎండాకాలంలో కుంభవృష్టి కురవడం తుఫాన్లు రావడం ఏర్పడటం అనేది చాలాచాలా అరుదు. కానీ ఈ అరుదైన ఋతుక్రమం నేడు వాతావరణ మార్పులు ద్వారా సహజంగా మారిపోయింది. సంగీతంలో శ్రుతి బాగుంటేనే శ్రావ్యంగా ఉంటుంది. అది మనసుకు హాయినిస్తుంది. అలాగే ప్రకృతిలో ఋతుగమనం సవ్యంగా సాగితేనే మనిషి ఋతువుకు కూడా హాయి గొలుపుతుంది. అలా కాకుండా ఋతువులు గతి తప్పితే ఏర్పడే ఉపద్రవం మాత్రం చెప్పనలవి కాదు. దాని పరిణామాలను ఎలా ఉంటాయి అనేది ప్రస్తుతం మనం చూస్తూనే ఉన్నాం. వేసవికాలంలో అయితే భానుడు భగభగలతో రోహిణి కార్తెలో రోళ్లు పగలడం మామూలే.

ఈ సమయంలో మనుష్యులు కూడా వడదెబ్బకు పిట్టల్లా రాలిపోతూ ఉంటారు. ఇంతటి వేడిమి గల రోహిణీ సమయంలో కూడా వరుణుడు తన ప్రతాపం చూపుతూ కుండపోత వర్షాలకు కారణమవుతున్నాడు. శతాబ్దం క్రితం వరకూ రుతుపవనాలు అనేవి కొంతలో కొంత అనుకున్న సమయానికి అటూఇటూగా వచ్చేవి. తొలకరి జల్లులతో ఆరంభమై ఆషాఢంలో ఆశలు పెంచి శ్రావణంలో నిండుగా కురిసి ప్రజల అవసరం తీరగానే వాటిదారిన అవి వెళ్లిపోయేవి. వాటికి అనుగుణంగానే మన జీవనవిధానం కూడా ఫ్రీగా కొనసాగేది. క్రమబద్ధంగా వచ్చే రుతుపవనాలు మన మనుగడకు ఎంతగానో దోహదపడేవి. అయితే ఇప్పుడు ఆ రుతుపవనాలు మాత్రం గతి తప్పుతున్నాయి. సమయం కాని సమయంలో రుతుపవనాలు వచ్చి కుండపోతగా వానను కుమ్మరిస్తున్నాయి. క్రమం తప్పకుండా వచ్చే రుతువుల్లో అనూహ్యామైన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. వర్షాకాలంలో రావల్సిన వానలు ఎండాకాలంలోనూ, ఎండాకాలంలో వేడి చలికాలంలోనూ కొనసాగుతోంది. మంచు దుప్పటి కప్పుకున్న ప్రకృతికాంత ఇప్పుడు కన్పించడం తగ్గిపోయింది. పచ్చగా కన్పించి రుతురాగాలు పాడే అడవులు అంతర్ధానమైపోతున్నాయి. తేమే ఎరుగని ఎడారుల, అందమైన ద్వీపకల్పాలు, సముద్రతీరంలో కన్పించాల్సిన రమణీయ దృశ్యాలు ఇప్పుడు కళావిహీనమైపోయాయి. నెలరోజుల వ్యవధిలో అప్పుడప్పుడు కురవాల్సిన వాన కుండపోతగా ఒకేరోజు 20 నుంచి 27 సెం.మీ.లవరకు కుమ్మరించిన సంఘటనలు ఈమధ్య తెలుగు రాష్ట్రాల్లోనే పలుసార్లు జరిగాయి. గత కొన్ని రోజులుగా పరిశీలిస్తే తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఇది ఎండాకాలం కాదేమో, వర్షాకాలం వచ్చిందేమో అనేలా వర్షాలు పడ్డాయి. మరొక ఆశ్చర్యపడే విషయం ఏమిటంటే ఎడారిదేశాల్లో కూడా తాజాగా కుండపోత వర్షాలు పడి వరదలతో జనజీవనం అస్తవ్యస్తమైన దృశ్యాలు మనకళ్లముందు సాక్షాత్కరిస్తున్నాయి.

## ఎడారి రాజ్యంలో కుంభవృష్టి

నిత్యం ఎండలతో అల్లాడిపోయే దుబాయ్‌లో తాజాగా

సంభవించిన కుంభవృష్టి ఫలితంగా ఏర్పడిన వరదలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి. విమానాశ్రయాలన్నీ జలమయమయ్యాయి. పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్‌తో సహా చాలా ప్రదేశాలు నీటమునిగాయి.

ఎడారి రాజ్యంలో ఇంతటి కుంభవృష్టి ఏర్పడటానికి వాతావరణ మార్పులే ప్రధాన కారణంగా చెబుతున్నారు శాస్త్రవేత్తలు. ఎడారి ప్రాంతం సహజంగా భానుడి భగభగలతో ఎల్లప్పుడూ ఎండ వేడితో నెలకొని ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక భూభాగం ఎడారిగా ఉండే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో తీవ్రస్థాయిలో సాధారణంగా 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ప్రధానంగా గల్ఫ్‌దేశాల్లో పచ్చదనం అన్నది అత్యంత అరుదుగా కనిపించే విషయంగా చెప్పవచ్చు. అయితే ఈమధ్యకాలంలో మాత్రం దుబాయ్, ఒమన్ బహ్రెయిన్ తదితర ప్రాంతాల్లో భారీ వరదలు సంభవిస్తున్నాయి. ఏడాది సగటు వర్షపాతం 200 మిల్లీమీటర్ల కంటే తక్కువగా ఉండే ఈప్రాంతాల్లో కొన్నిగంటల వ్యవధిలోనే కుండపోత వానలు జనజీవనాన్ని స్తంభింపచేశాయి. ఒక్కరోజు వ్యవధిలోనే దుబాయిలో 142 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏడాదిన్నరలో పడాల్సిన వర్షపాతం ఒక్కరోజులోనే నమోదయ్యింది. 75 సంవత్సరాలలో ఎప్పుడూ లేనంత వర్షపాతం ఒక్కరోజులోనే కురిసింది. ఇక, చైనాలో అయితే ఇటీవల ఏకంగా ఏడాది కురవాల్సిన వర్షం నాలుగురోజుల్లో కురిసి దేశాన్ని వరదల్లో ముంచెత్తింది. దీనివలన వరదలు ముంచెత్తి జనజీవనం అస్తవ్యస్తమై లక్షలాది ప్రజల్ని నిరాశ్రయులయ్యారు. కనీవినీ ఎరుగని రీతిలో ఇక్కడ భారీవర్షాలు ముంచెత్తడానికి గల కారణాలపై ఇప్పుడు మరలా చర్చ మొదలయ్యింది. ఈక్రమంలో దుబాయ్‌లో ఇంతవర్షం కురవడానికి క్లౌడ్‌సీడింగ్ కారణమనే వార్తలు వెల్లువెత్తాయి. పెరుగుతున్న జనాభాకు తగినంత నీటిని అందించడం, అత్యధిక ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచడం, భూగర్భజలవనరులను పెంపొందించడం, నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవడం వంటి ఉద్దేశాలతో ఎక్కువగా అరబ్‌దేశాలు క్లౌడ్‌సీడింగ్‌లు ఆశ్రయిస్తున్నాయి. విమానాలు, రాకెట్ల ద్వారా మేఘాల్లో రసాయనాలు చల్లి, ఆ మేఘాలు కరిగివర్షంలా మార్చే ప్రక్రియనే క్లౌడ్‌సీడింగ్ అంటారు. 1982 నుంచి యూఏఈలో ఈ కృత్రిమ వర్షాలపై అనేక ప్రయోగాలు జరిగాయి. 2000వ సంవత్సరంలో నాసా, దక్షిణాఫ్రికా పరిశోధక బృందాలసాయంతో యూఏఈ పాలకులు క్లౌడ్‌సీడింగ్‌ను ముమ్మరం చేశారు.



సీడింగ్ ప్రక్రియలో మేఘాలను వర్షింప చేయడానికి సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్, సోడియం క్లోరైడ్, సాలీడ్ కార్బన్‌డై ఆక్సయిడ్ వంటి హానికర రసాయనాలు ఉపయోగించి మేఘాలను పెద్దపెద్ద నీటి బిందువులుగా చేస్తారు. దీనిఫలితంగా వర్షం సంభవిస్తుంది. ఈ ప్రక్రియ కరవుపీడిత ప్రాంతాలకు కొంత ఉపశమనం కలిగించినా సహజసిద్ధ వాతావరణానికి తీవ్రమైన నష్టం జరిగి వాతావరణంలో అనూహ్యమార్పులు సంభవిస్తాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. క్లౌడ్‌సీడింగ్ ద్వారా కృత్రిమ



వర్షాలను కురిపించడం అనేది ఒకరకంగా ప్రకృతిని ఉల్లంఘించడం వంటిదేనన్నది వాతావరణ పరిశోధకుల అభిప్రాయం. ఒకచోట ఇలా అత్యధిక వర్షపాతాలు కురిపిస్తే, అది మరోచోట అనావృష్టికి దారితీసి కరవు ఏర్పడుతుందన్న విషయం గమనించాలని, ప్రకృతి వనరుల నియంత్రణలో మానవ జోక్యం తగదని నిపుణులు హెచ్చరికలను పట్టించుకున్న దాఖలాలు లేవు.

ప్రకృతి వనరుల నియంత్రణలో మితిమీరిన మానవ ప్రమేయం ఉండటం వల్లనే ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి అని మరచిపోకూడదు.

## మండే ఎండల్లో వర్షాలు పడటానికి కారణం?

వాతావరణ శాస్త్రవేత్తల ప్రకారం దక్కన్ పీఠభూమి ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కొన్ని ప్రాంతాలలో వేసవిలో వర్షాలు పడే అవకాశం ఎక్కువ. అలాగే మత్స్యాడ ప్రాంతం సమీపంలో ఉండటం వలన క్యుమలోనింబస్ మేఘాలు ఏర్పడి వాటివలన ఎండాకాలంలో కూడా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. అంతేకాకుండా, వర్షాపాతాలలో కూడా రకాలు ఉంటాయి. దీనిలో ఉష్ణప్రసరణ వర్షపాతం ఒకటి. మండే ఎండాకాలంలో ఈ తరహా వర్షపాతం ఉంటుంది. వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండటం వలన వాతావరణంలోని గాలి ఉష్ణోగ్రత పెరిగి తేలిక అవుతుంది. దీంతో అది చాలా ఎత్తుకి వెళ్లడం వలన అక్కడ నీటిబిందువులు తయారు అవుతాయి. దీనిని మోల్ అని కూడా అంటారు. ఇలా ఒక్కోనీటి బిందువు తయారై ఉష్ణ విడుదల కావడం వలన మబ్బు ఉష్ణోగ్రత పెరిగి, నీటి బిందువులు వర్షంగా మార్పు చెంతుతుంది. దీనికారణంగానే వేసవిలో వర్షాలు పడుతున్నాయని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇటువంటి వర్షాలకు దట్టమైన మేఘాలు రావాల్సిన అవసరం లేదు. మబ్బు ఎక్కువగా లేకపోయినా ఈ వర్షం పడుతుందంటున్నారు మరికొందరు నిపుణులు.

మనదేశం చుట్టూ ఉన్న మూడు సముద్రాలపై గాలులు, ఆ పక్కనే ఉండే పసిఫిక్ సముద్రగాలులు, మేఘాలకు హిమాలయాల అడ్డంకులు కలసి కురిసే వర్షమే భారతావనికి ప్రాణం. రైతుకు ఆయువు. పంటకు ఆధారం. ప్రపంచంలో కేవలం రుతుపవనాలపైనే ఆధారపడి, వ్యవసాయానికి అవసరమైన నీటిలో దాదాపు 80శాతం ఇస్తున్న ఆ గాలుల దిశ, దశ ఇప్పుడు పూర్వంలా స్థిరంగా లేదు.

దీంతో భారతీయుల జీవనమార్గం లయ తప్పుతోంది. దాంతో ఆనందం ఆవిరైపోతోంది. భారత ఆర్థికరంగంలో 80శాతం వ్యవసాయం ద్వారానే వస్తోంది. ప్రజల్లో 70శాతం దీనిపైనే బతుకువెళ్లదీస్తున్నారు. మనదేశస్థూల జాతీయోత్పత్తిలో 20శాతం దీనిద్వారానే సమకూరుతోంది. ఒక్క ఏడాది రుతుపవనాల గమనం లయ తప్పితే అది దేశ ఆర్థిక, జీవన ప్రమాణాలపై తీవ్రప్రతికూల ప్రభావం చూపుతుంది. అయితే జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ మనదేశంలో నైరుతి రుతపవనాలు వలన ఆడపాదడపా వర్షాలు పడుతున్నాయి. కేవలం అల్ప పీడనం, ఉపరితల ఆవర్తనం ద్రోణి, తుపానులు ఏర్పడినప్పుడు మాత్రమే కుండపోత వర్షాలు కురుస్తు న్నాయి. అవి కూడా లేకపోతే వర్షాభావ పరిస్థితులు వెంటాడు తున్నాయి. దీనివలన ప్రధానంగా భూగర్భ జలాలు తగ్గిపోవడం, భూమిలో తేమ తగ్గి పంటలు పండకపోవడం, ఆహార అభద్రత ఏర్పడి కరవు కాటకాలు ఏర్పడి మానవ మనుగడకే ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ కాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటానికి శాస్త్రవేత్తలు ఎల్‌నినో.. లానినా ప్రభావం కారణంగా చెబుతున్నారు.



## ఎల్‌నినో.. లానినా

వాతావరణంలో మార్పులకు ఎల్‌నినో.. లానినా అనేవి ప్రధాన కారణంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూతాపం కారణంగా ఇవి సంభవిస్తున్నాయని నిపుణుల అంచనా. ఈ ఎల్‌నినో, లానినా అనేవి వాతావరణంలో సంభవించే పరస్పర విరుద్ధ పరిణామాలుగా చెప్పవచ్చు. ఈ రెండింటినీ కలిపి 'ఎల్‌నినో ఆసిలేషన్' (ఇఎన్ఎస్ఓ) వలయాలు అంటారు. సముద్రం, దానిపైన ఆరించి ఉండే వాతావరణాల ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయిలో ఒడుదుడుకులకు లోనవడం వల్ల ఇవి ఏర్పడతాయి. ఈఎన్ఎస్ఓ ఉష్ణ దశను ఎల్‌నినో అనీ చలి దశను లా నినా అని పిలుస్తారు.

ఆసియా, ఆస్ట్రేలియా ఖండాలు, ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల మధ్య విస్తరించే ఉండే పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడే ప్రత్యేక సముద్ర పవనాలు ఎల్‌నినో-లానినాలకు కారణం అవుతాయి. భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితలంపై అసాధారణ వేడి లేదా చల్లదనం లాంటివి నమోదవుతాయి. ఈ పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలను, వర్షపాతాలను ప్రభావితం చేస్తాయి. ఎల్‌నినో అయితే విపరీతమైన వేడి, తక్కువ వర్షపాతం నమోదవుతుంటుంది. లానినాలో వర్షాలు విపరీతంగా ఉంటాయి. ఈ రెండు పరిణామాలు ఒకదాని తర్వాత ఒకటిగా ప్రతి నాలుగైదేళ్ల భ్రమణంలో సంభవిస్తుంటాయి. సాధారణంగా ఎల్‌నినో ఎక్కువగా సంభవిస్తుంటుంది. సాధారణ పరిభాషలో చెప్పాలంటే ఎల్‌నినో వర్షాభావ పరిస్థితిని వివరిస్తుంది.

ఎల్‌నినో ఏర్పడితే వర్షాభావ పరిస్థితులు ఎదురై కరువు కాటకాలకు దారి తీస్తుందంటున్నారు శాస్త్రజ్ఞులు. వేడి నీటి ప్రవాహాలు సముద్రం పైన గాలిలో నీరు చేరేందుకు అడ్డుపడి వర్షాభావంతో కరువులకు నెలవులు అవుతుంటాయి. లా నినా విపరీతంగా వర్షాలు కురిసే పరిస్థితిని వివరిస్తుంది. భూమధ్యరేఖ సమీపంలోని పసిఫిక్ మహా సముద్ర జలాలు వేడెక్కడం వల్ల ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడతాయి. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంపై దీని ప్రభావం ఉంటుంది. ఎల్‌నినో వల్ల సముద్ర జలాల ఉష్ణోగ్రత సగటున 0.5 డిగ్రీల సెంటీగ్రేడు పెరుగుతుంది. ఈ పెరుగుదల ఒక్కోసారి, అరుదుగానే అయినా, 2 నుండి 6 డిగ్రీల వరకూ కూడా ఉండవచ్చు. ఎల్‌నినో సంభవానికి ఒక క్రమ పద్ధతి అనేది ఏమీ లేదు. 2 నుండి 7 సంవత్సరాల వ్యవధిలో ఇది ఏర్పడవచ్చు. సగటు వ్యవధి 5 సం॥లు అని ఒక అంచనా. ఎల్‌నినో వ్యవధి 7 నుండి 9 నెలల వరకు ఉంటుంది.

లానినా వాతావరణం సాధారణంగా ఎల్‌నినో అనంతరం ఏర్పడతాయి. కానీ ఎల్‌నినో అనంతరం కచ్చితంగా లానినా ఏర్పడుతుందని గ్యారంటీ లేదు. నీటి ఉష్ణోగ్రత సామాన్య స్థితికన్నా బాగా తగ్గిపోవడం వల్ల 'లానినా' సంభవిస్తుంది.

తూర్పు పసిఫిక్ మహా సముద్రంలో భూమధ్యరేఖ ప్రాంతం వెంబడి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే పడిపోయినప్పుడు లానినా ఏర్పడుతుంది. ఉష్ణోగ్రత తగ్గుదల 3 నుండి 5 డిగ్రీల సెల్సియస్ ఉండవచ్చు. లానినా ప్రభావాలు ఎల్‌నినో ప్రభావాలకు సరిగ్గ విరుద్ధంగా ఉంటాయి. ప్రభావిత ప్రాంతాల్లో వర్షాలు భారీగా కురుస్తాయి. ముఖ్యంగా చిలీ, పెరూ, న్యూజీలాండ్, ఆస్ట్రేలియా తీరాల్లో కుంభవృష్టి పడుతుంది. లానినా వల్ల పశ్చిమ దక్షిణ ఇండాయాలో ఎల్‌నినో వలన నైరుతీ ఋతుపవనాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

లానినా వల్ల భారత నైరుతీ ఋతుపవనాలు లాభపడతాయి. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం ఇవ్వడానికి లానినా దోహదం చేస్తుంది. ఉదాహరణకి 2010లో పసిఫిక్‌లో ఏర్పడిన లానినా వల్ల ఇండియాలో నైరుతి ఋతుపవనాలు దండిగా వర్షాలు ఇచ్చాయి. ఆస్ట్రేలియాలో అయితే ఆకాశం విరిగి నేల మీద పడినట్లుగా వర్షాలు కురిసి తీవ్రమైన ఉత్పాతాలకు దారి తీసింది. భారతదేశ వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతం నైరుతి ఋతుపవనాలదే. వ్యవసాయ రంగానికి రుతుపవనాలే కీలకం. దేశ స్థూల జాతీయోత్పత్తి(జిడిపి) లో వ్యవసాయ రంగం వాటా 14 శాతం ఉన్నది. 1.4 బిలియన్ల జనాభా ఉన్న దేశంలో సగం కంటే ఎక్కువ జనాభాకు వ్యవసాయమే జీవనోపాధిని అందిస్తున్నది. ఏప్రిల్-జూన్ నాటికి ఎల్‌నినో, ఈఎన్ఎస్ఓ తటస్థంగా మారే అవకాశం 79 శాతం ఉందని అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్ఓఏఏ) ఇటీవల తెలిపింది. 2023లో లోటు వర్షపాతాన్ని అందించిన ఎల్‌నినో పరిస్థితులు ఈ ఏడాది జూన్ నాటికల్లా కనుమరుగు కానున్నాయనీ, దీంతో ఈ వర్షాకాలంలో పుష్కలంగా వానలు పుష్కలంగా కురుస్తాయన్న ఆశలు కలుగుతున్నాయని వాతావరణ శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. గడిచిన పన్నెండు వేల సంవత్సరాలుగా మానవ నాగరిక పరిణామానికి దోహదపడిన వాతావరణం ఇప్పుడెందుకిలా మనిషి మనుగడకు ప్రమాదకంగా మారింది? ఇదంతా ప్రకృతి పరంగా సహజమైనది కాదనీ, ఈ మార్పుల వెనుక మానవ ప్రమేయం కారణంగా ఏర్పడే భూతాపమే ప్రధాన కారణం అంటూ విజ్ఞానశాస్త్రం విస్పష్టంగా చెబుతున్న సత్యం.

## భూతాపం

సూర్యకాంతిలో ఉండే అతినీలలోహిత కిరణాలు రేడియో ధార్మికతను కలిగి ఉంటాయి. ఇవి వాతావరణం ద్వారా ప్రయాణించి భూమిని వేడెక్కిస్తాయి. ఈ వేడి తిరిగి వాతావరణంలోకి పరావర్తనం చెందుతుంది. కానీ గాలిలో ఉండే కార్బన్ డై ఆక్సైడ్ ఈ వేడిని బంధించి భూ వాతావరణంలోనే ఉండేలా చేస్తుంది. దీన్ని హరిత గృహ ప్రభావం అంటారు(కార్బన్ డై ఆక్సైడ్‌నే గ్రీన్ హౌస్ వాయువు అంటారు). దీంతో భూమి వేడెక్కుతుంది. దీన్నే గ్లోబల్ వార్మింగ్ లేదా భూతాపం అంటారు. పరిశ్రమలు ఇబ్బడి ముబ్బడిగా పెరగడం, అడవుల నరికివేత నిత్యం బొగ్గు, పెట్రోలియం, కిరోసిన్, డీజిల్ తదితర శిలాజ ఇంధనాలను మండిస్తూ ఉండటం వలన కార్బన్ డై ఆక్సైడ్ పెరిగి భూతాపం పెరిగిపోతోంది. మొత్తంగా భూమి వేడెక్కిపోవడమే అన్ని అనర్థాలకు కారణంగా చెప్పవచ్చు. అభివృద్ధి పేరిట బొగ్గుపులుసు వాయువును ఉత్పత్తి చేసే బొగ్గు, ఇతర శిలాజ ఇంధనాలను విస్తృతంగా వాడటం వల్ల కాలుష్యం పెరిగి భూమి వేడెక్కిపోతోంది.

దీనికితోడు విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం కూడా తోడై వాతావరణం అనూహ్య మార్పులకు లోనవుతోంది. రుతువులు క్రమం తప్పుతున్నాయి. శీతాకాలం వచ్చినా కూడా వేడి, ఉక్కపోత తగ్గడం లేదు. వాతావరణ మార్పు వలన అధిక ఉష్ణోగ్రతలు, కలుషిత వాతావరణం, జల సంక్షోభం, ప్రకృతి విపత్తులు సంభవించి ప్రపంచ ఆర్థిక, సామాజిక వ్యవస్థల్ని అతలాకుతలం చేస్తున్నాయి. వాతావరణ మార్పులు, వైపరీత్యాలకు ప్రపంచ అంతా నష్టపోతోంది. దీనికి మానవ తప్పిదాలూ తోడవుతున్నాయి. ఆధునిక జీవన శైలితో మరిన్ని కష్టాలు ఎదురవుతున్నాయి. ప్రకృతిని మనిషి పట్టించుకోకపోవడంతో ప్రకృతి ప్రకోపం మొదలై భూతాపం, వాతావరణ మార్పులతో ప్రపంచం వరుస విపత్తులతో తల్లడిల్లుతోంది. నిత్యం ఎక్కడో ఒకచోట కార్చిచ్చులో, తుపానులో, వరదలో, క్షామమో ప్రజలను బాధిస్తున్నాయి. ఏకంగా మనిషి మనుగడకే సవాల్ విసురుతున్నాయి.

వాతావరణ మార్పుల అంశం 19వ శతాబ్దంలోనే ప్రస్తావనకు వచ్చినా, దానిని కట్టడి చేసే అంశంపై మాత్రం అంతర్జాతీయ చర్చలు గత పాతిక ముప్పై ఏళ్ల నుండి మాత్రమే జరుగుతున్నాయి. అయితే ఇంతవరకూ గట్టి ఒప్పందం ఒక్కటీ కుదరలేదు. కుదిరినా దానిని అమలు చేయడంలో ఏమాత్రం చిత్తశుద్ధి కనపరచడం లేదు అనేది సుస్పష్టం. దాంతో ఒప్పందాల విషయంలో ఎవరి దారి వారిదే అన్న చందంగా నేటికీ కొనసాగుతోంది.

ఈ శతాబ్ది చివరికి భూమి సగటు ఉష్ణోగ్రతలో పెరుగుదల పారిశ్రామికీకరణ పూర్వ దశకంటే రెండు డిగ్రీల సెంటిగ్రేడ్‌కు మించి పెరిగితే అడ్డుకోలేని విపత్కర వాతావరణ మార్పులు తప్పవని శాస్త్రజ్ఞులు ఎంతో కాలంగా హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ అవి మనకు పట్టడం లేదు. దీనివలన ఎదురవుతున్న అనేక వైపరీత్యాలను మనం



ఎదుర్కోవలసి వస్తున్నది.

ఒక పద్ధతి ప్రకారం సాగాల్సిన మూడు కాలాలు ఆరు రుతువుల విధానం మానవ ప్రమేయం వలన గతి తప్పినప్పుడు ఏర్పడే పరిస్థితులను వాతావరణ వైపరీత్యాలు అంటారు. రుతువులు గతి తప్పడం వలన ఏర్పడే ఈ వైపరీత్యాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. భూతాపం వేగంగా పెరిగిపోతున్న కారణంగా మంచు పర్వతాలు మొదలెట్టాయి. ఓజోన్ పొరకు రంధ్రాలు పడ్డాయి. సముద్ర జలాలు తీరం వైపు ఎన్నడూ లేని రీతిలో ముంచు కొస్తున్నాయి. తన అవసరాలు పెరిగేకొద్దీ ప్రకృతి అందించిన సహజ వనరులను మితిమీరి వినియోగించడం మొదలు పెట్టిన నాటి నుంచి పర్యావరణంలో సమతూకం దెబ్బతినడం ఆరంభమైంది. ప్రధానంగా భూతాపం పెరగడం వల్ల ఏర్పడే వైపరీత్యాలు 1970-2005 మధ్య 250 సార్లు సంభవిస్తే 2005-2019 మధ్య పద్నాలుగేళ్లలోనే 310 సార్లు సంభవించాయి. గత ఏడాదిలోనే భారీ వరదలు 40 లక్షల మందిని నిర్వాసితుల్ని చేసాయనీ, ఇక ముందు ఏటా దాదాపు పది కోట్ల మంది వరదల బారిన పడతారనీ, ప్రకృతి విపత్తుల ప్రభావం ఆసియా మీదే ఎక్కువనీ శాస్త్రజ్ఞుల అంచనా. ఇంకా ఎండలు పెరిగితే ఎడారులు పెరుగుతాయి. నీటి వనరులు లేక పంటలు పండవు. జలవిద్యుదుత్పత్తి తగ్గిపోతుంది. దాంతో వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగాలన్నీ నష్టపోతాయి. తీవ్రమైన కరువు వస్తుంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఇప్పటికే చాలా ప్రాంతాలు అలా మారాయి. ఈ అసాధారణ పరిస్థితుల వల్ల ఏటా ప్రపంచ వ్యాప్తంగా 50 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుంటే అందులో ఏడున్నర లక్షల మంది భారతీయులు ఉంటున్నారని లాన్సెట్ అధ్యయనంలో వెల్లడైంది.

## అటవీ క్షీణత

వర్షాభావ పరిస్థితులు ఏర్పడటానికి ప్రధాన కారకాలలో అటవీ క్షీణతను ఒకటిగా చెప్పవచ్చు. పారిశ్రామిక విప్లవం అనంతరం పరిశ్రమలు, నివాస స్థలాల భవన సముదాయాల నిర్మాణం కోసం విచక్షణా రహితంగా చెట్లను నరికివేయడం, కార్పొరేట్ సంస్కృతి, పారిశ్రామికీకరణ, గనుల తవ్వకాలు, హైవేలు, బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ఏర్పాటు చేయడం వెరసి మానవుల స్వార్థ చింతనతో సంప్రదాయ పర్యావరణ విలువలు తగ్గి అడవుల విధ్వంసానికి దారి తీస్తున్నది

➤ ప్రపంచ వ్యాప్తంగా 19వ శతాబ్దం నుండి సుమారు 12.9 కోట్ల కి.మీ.కు పైగా విస్తీర్ణంలో అటవీ భూములు కనుమరుగైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గత 30 ఏండ్లలో 10 శాతం మేర సుమారు 420 మిలియన్ హెక్టార్స్ అటవీ భూములు కోల్పోయినట్లు ది స్టేట్ ఆఫ్ వరల్డ్ ఫారెస్టర్స్-2022 నివేదిక పేర్కొంది. యుఎన్ఓ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్రతి సంవత్సరం అటవీ నిర్మూలన వల్ల ప్రపంచంలో 1 లక్షా 30 వేల కి.మీ. మేర అడవులు అంతరించి పోతున్నాయి.

➤ 1990లో ప్రపంచ అటవీ విస్తీర్ణం, 4,128 మిలియన్ హెక్టార్ల ఉండగా, ఇది 2015 నాటికి 3,999 మిలియన్ హెక్టార్లకు తగ్గింది. ఇదే కాలానికి సంబంధించి ప్రపంచ భూవిస్తీర్ణంలో అటవీ విస్తీర్ణంలో 31.6 నుంచి 30.6 శాతానికి పడిపోయింది.

➤ అటవీ నివేదిక-2013 ప్రకారం మన దేశంలో అటవీ విస్తీర్ణం 6,97,898 చదరపు కిలోమీటర్లు. ఇది మొత్తం విస్తీర్ణంలో 21.23 శాతం. మొత్తం విస్తీర్ణంలో అటవీ విస్తీర్ణం 1/3 వంతు ఉండాలని భారత ప్రభుత్వ జాతీయ అటవీ విధానం(1952) సిఫార్సు చేసింది. అయితే ఇప్పటికీ ఈ లక్ష్యాన్ని చేరుకోలేదు.

➤ పర్యావరణ సమతుల్యానికి ఏ దేశంలోనైనా మూడో వంతు వైశాల్యంలో అడవులు ఉండాలి. పెరుగుతున్న జనాభా, పరిశ్రమల స్థాపన, రహదారుల నిర్మాణం కోసం అడవులను నరికివేస్తున్నారు. మన దేశంలో సంపన్నమైన జీవ వైవిధ్యానికి ఆతిథ్యమిచ్చేవి ఈశాన్య రాష్ట్రాలేనని చెప్పవచ్చు. అయితే అటువంటి ఈశాన్య రాష్ట్రాలలో మాత్రం అటవీ విస్తీర్ణం క్షీణిణించడం అనేది విచారికంచ దగ్గ విషయం ఈ ఈశాన్య రాష్ట్రాలలో అటవీ విస్తీర్ణం బాగా తగ్గుదల కలిగిన రాష్ట్రం నాగాలాండ్. ఈ రాష్ట్రంలో 2019 నుండి 21 వరకు చూస్తే దాదాపు 1.88 శాతం అటవీ విస్తీర్ణం తగ్గిపోయింది. ఇదే సమయంలో మణిపూర్‌లో అయితే ఇది 1.48 శాతంగా, మిజోరాం 1.03 శాతం, మేఘాలయ 0.48 శాతం, అరుణాచలప్రదేశ్‌లో 0.39 శాతం మేర అటవీ విస్తీర్ణం తగ్గిపోయినట్లు సర్వే పేర్కొంది. వీటితో పాటు ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌లో కూడా అటవీ విస్తీర్ణం క్షీణత కొనసాగింది. మొత్తం మీద 11 రాష్ట్రాలలో అటవీ విస్తీర్ణం తగ్గుదల స్పష్టంగా కనిపిస్తూ ఉంది. ఈ రాష్ట్రాలలో అడవుల విస్తీర్ణం తగ్గడంతో పాటు చెట్ల విస్తీర్ణంలో కూడా క్షీణత కొనసాగుతున్నది.



➤ దేవ భూభాగంలో 33 శాతం మేర అటవీ విస్తీర్ణాన్ని నిర్దేశిత లక్ష్యంగా పెట్టుకుని దశాబ్దాలు దాటుతున్నా దాన్ని చేరుకోవడం సాధ్యం కాలేదు. అడవుల పరిరక్షణ, పెంపకం కోసం జాతీయ స్థాయిలో సమగ్ర అటవీ విధానం రూపకల్పన యేళ్ల తరబడి సాగుతూనే ఉంది.

ఇది భూతాపం, లానినో, ఎల్‌నినో, వేడిగాలులు వంటి వాతావరణ అసాధారతలకు, వరదలకు, కరువు కాటకాలకు, విపత్తులకు కారణమవుతోంది. పర్యావరణ సమతులతను చేజేతులా మనమే దెబ్బ తీసి అడవులు, చెట్లను నరికివేస్తుంటే ఇక సహజ వర్షాలను చేజేతులా అడ్డుకున్నట్లే అని శాస్త్రవేత్తలు ఘోషిస్తున్నా మనలో మాత్రం ఆశించదగ్గ మార్పు కానరావడం లేదు.

**కార్చిచ్చులు:** మనిషి అత్యాశకు అడవులు బలైపోతుంటే మానవ నిర్లక్ష్యం కారణంగా పెరిగిన భూతాపం మిగిలిన వనాలను మింగేస్తోంది. ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటూ, వాతవరణం మరింత పొడిగా మారిపోయిన నేపథ్యంలో కార్చిచ్చుల సంఖ్య పెరిగిపోతున్నాయి. గత రెండేళ్లుగా ప్రపంచంలో ఏదో ఒక్క పక్కన కార్చిచ్చు మండుతూనే ఉంది. మొదట ఆస్ట్రేలియా, తర్వాత అమెజాన్ అడవులు, ఇప్పుడు కాలిఫోర్నియా, టర్కీ, గ్రీస్, ఇటలీ, స్పెయిన్.. వీటిల్లో కొన్ని చోట్ల నెలల తరబడి అడవులు తగలబడుతూనే ఉన్నాయి. చుట్టుపక్కల ఊళ్లనీ కబళిస్తూనే ఉన్నాయి. కార్చిచ్చు ఘటనల సంఖ్య ఉత్తరాఖండ్‌లో గత రెండు దశాబ్దాల్లో బాగా పెరిగాయి. డెబ్బయ్ శాతం అడవులున్న ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో దావానలాలను సమర్థవంతంగా ఎదుర్కోలేకపోతున్నా మనే చెప్పవచ్చు. ఈ వేడి వల్లే మరోపక్క మంచు కరిగిపోయి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. కార్చిచ్చులకు తోడు అడవుల నరికివేత వల్ల మరో రెండు తరాల తర్వాత అడవులనేవి ఉండకపోవచ్చు అనేది శాస్త్రవేత్తల అంచనా. కార్బన్ గ్రాహకాలుగా పనిచేసే అడవుల క్షీణతతో పాటు అడవులో జీవ వైవిధ్యాన్ని దిగజార్చే ఏ చర్య అయినా కార్బన్ ఉద్గారాలకు పెరిగిపోవడానికి కారణం అవుతుంది. వాతావరణం మార్పును నిరోధించి ఈ భూతాపాన్ని అరికట్టాలి. రానున్న కాలంలో భూతాపం కట్టడి చేయలేకపోతే వాతావరణంలో ఊహించని మార్పులు మరిన్ని చోటు చేసుకుంటున్నాయనీ ఇకనుంచీ ఇవి మరింత తరచుగా సంభవిస్తుంటాయనీ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

పారిశ్రామిక విప్లవంతో మొదట్లో వచ్చిన ప్రగతి చూసి అందరూ గర్వపడ్డారు. అభివృద్ధిలో దూసుకుపోతున్నామనుకుని సంతోషించారు. అత్యున్నత ఆవిష్కరణలను కనిపెడుతున్నామని అనుకున్నారు. కానీ మానవ చర్యల కారణంగా కాలుష్యం పెరిగి వాతావరణంలో పెనుమార్పులు సంభవించి మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతోందని గుర్తించలేకపోయారు. మనం గుర్తించని ఈ విషయాన్ని శాస్త్రవేత్తలు ఎప్పుడో గర్తించడమే కాదు హెచ్చరించారు కూడా. ఇప్పటికిప్పుడు మనం కళ్ల తెరచి కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు వెలువడకుండా పూర్తిగా ఆపివేసినప్పటికీ దాని ప్రతికూల పర్యవసానాలు వెంటనే ఆగకపోవచ్చు. కొన్ని ప్రభావాలను తప్పక చవిచూడాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికైనా కాలుష్య ఉద్గారాలను దూకుడు తగ్గించడం ద్వారా, వాతావరణ మార్పుల వల్ల వచ్చే తీవ్రమైన పరిణామాలను కొంతైనా నివారించవచ్చు. భావి తరాల వారి ప్రయోజనాలను కాపాడవచ్చు. దీని కోసం గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను అదుపు చేయడం, ముఖ్యంగా కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాన్ని తగ్గించడం తప్ప వేరొక మార్గం లేదు. దీనికి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడం ఒక్కటే మార్గం. అప్పుడే ఈ ఉష్ణోగ్రతలు తగ్గటం మాట అటుంచి కనీసం పెరగకుండా ఉంటాయి. శాస్త్ర విజ్ఞాన పురోగతిలో నవకల్పనల సృష్టిలో నూతన గ్రహాల అన్వేషణలో అంతరిక్షం వైపు సాగిపోతున్న మనం మన ఉనికికి మన మనుగకు మూలమైన భూమిని కాపాడుకోవడంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాం. మన ధోరణి వలన ఏ పాపం ఎరుగని జీవకోటికూడా మూల్యం చెల్లించవలసి వస్తూ ఉంది. ఇప్పటికే మన చర్యలు వలన ఎన్నో జీవ జాతులు అంతరించిపోయాయి. అభివృద్ధి పేరిట సాగించే పర్యావరణ మారణ హోమంలో చివరకు తామే సమిధగా మారుతానన్న గ్రహింపులేక మనకు మమే ప్రమాదాన్ని కొనితెచ్చుకొంటున్నాం. భావితరాల వారి ఉనికిన ప్రశ్నార్థకం చేస్తున్నాం. ప్రకృతి మనుషుల అవసరాలు తీర్చగలదుగానీ అత్యాశలను తీర్చలేదు అనే సత్యాన్ని గ్రహించ కుండా ప్రకృతిని యధేచ్ఛగా దోపిడీ చేయడం వలన ఇప్పటికే అనేక విపత్తులు మనల్ని చుట్టుముడుతూ ఉన్నాయి. మన తరువాత తరాలు క్షేమంగా ఉండాలంటే మనం చేసిన తప్పును మనమే సరిదిద్దడం ప్రారంభించాలి. గతి తప్పిన రుతువుల గమనంలో భవిష్యత్‌లో మరిన్ని ప్రమాద ఘంటికలు రాకుండా బాధ్యత మనదే. ప్రకృతి లేనిదే మానవ మనుగడ లేదని గ్రహించి, ప్రకృతి ప్రకోపానికి మరింత గురి కాకుండా దానిని కాపాడుకునే దిశగా ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకోవడానికి బాధ్యతగా ముందుకు రావలసిన సమయం ఆసన్నమైంది. ❑

# రైతు పంట చల్లగా..



**కొనేది** గుప్పెడు మల్లె మొగ్గలే అయినా తాజాగా ఉన్నాయా సువాసన వస్తున్నాయా అని పట్టిపట్టి చూసి మరీ కొంటాం. వాటిని పండించే రైతు తోట నుంచి ఎంత జాగ్రత్తగా మార్కెట్‌కి చేరవేస్తేనే పువ్వులు వాసన వెదజల్లుతూ తాజాగా కనిపించేది. గులాబీలు లిల్లీలూ కూడా అంతే త్వరగా కోసిన వెంటనే అమ్మకపోతే రెక్కలు ఊడిపోతుంటాయి. చేపలూ, రొయ్యలేమో పట్టిన తరువాత ఎక్కువసేపు బయట ఉంటే చెడిపోతాయి. అందుకోసం రైతులు ఖర్చుతో కూడికున్నా సరే పంటకు గిట్టుబాటు ధర రావాలని ఏ పూటకాపూట వాటిని కోసి మార్కెట్‌కు చేరవేస్తుంటారు. ఈ క్రమంలో వారు ఎదుర్కొనే వ్యయప్రయాసలెన్నో. రైతుల కష్టాలు ఇలా ఉంటే..పూలూ, పండ్లూ, చేపలూ, పాలూ అమ్ముకునే వ్యాపారులు కూడా వాటిని పాడవకుండా అమ్మేసుకోవాలి. అమ్ముడుపోకపోతే ఫ్రిజ్‌లో పెట్టాలి. రైతులూ, చిరువ్యాపారులూ అలా ఇబ్బందిపడకుండా పోర్టబుల్ కోల్డ్ స్టోరేజీ బాక్సులను తక్కువ ధరకే అందించి వారికి ఆర్థిక ఇబ్బందులను దూరం చేసి ఆదాయం పెంచుతోంది చెన్నైకి చెందిన 'టాన్90' అనే స్టార్టప్. రైతు నేపథ్యం నుంచి వచ్చిన ముగ్గురు మిత్రుల ఆలోచనే ఈ అంకుర సంస్థ. వీళ్లు అందించే ఆ బాక్సులూ, బ్యాగుల వల్ల తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని దాదాపు ఆరువేలమంది రైతులు లాభపడుతున్నారు.

**పదిగంటలు తాజాగా**

సౌమల్య ముఖర్జీ, రజనీకాంత్ రాయ్, శివశర్మ..మద్రాస్ ఐఐటీలో పిహెచ్‌డీ చేశారు. కోల్డ్‌స్టోరేజీ సదుపాయాలను చిన్నచిన్న వ్యాపారులకూ, రైతులకూ కూడా అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ఆ ముగ్గురు మిత్రులు కలిసి 2019లో 'టాన్90'ని ప్రారంభించారు. మొదట పాలప్యాకెట్ల రవాణాకు ఉపయోగపడే 40 లీటర్ల పోర్టబుల్ కోల్డ్‌స్టోరేజి యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చారు. అంతలో కొవిడ్ వల్ల లాక్‌డౌన్ విధించడంతో జనాలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. ఆ సమయంలోనే తాజా కూరగాయలూ, పండ్లూ, ఫ్రోజెన్‌ఫుడ్‌కు బాగా డిమాండ్ పెరగడంతో కూలింగ్ కెమికల్స్ మీద పరిశోధనలు మొదలుపెట్టింది శివ మిత్రబృందం. అందులో భాగంగానే 13 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి మైనస్ 24 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతను నియంత్రించే బాక్సులనూ, బ్యాగ్‌లనూ తయారుచేసి మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. సాధారణంగా ఆహారపదార్థాలూ, త్వరగా పాడయ్యే ఉత్పత్తుల రవాణాకు ఏసీ ట్రక్కులను వాడతారు. చేపలూ, రొయ్యలకైతే ఎక్కువ మొత్తంలో ఐస్ కావాలి. టాన్90 సంస్థ తయారుచేసిన బాక్సులూ, బ్యాగుల్లో అయితే ఎలాంటి ఖర్చు లేకుండానే త్వరగా పాడయ్యే వాటిని నిల్వ చేయొచ్చు, ఎక్కడి నుంచి ఎక్కడికైనా తేలిగ్గా తరలించొచ్చు. 'ఫేజ్ ఛేంజ్ మెటీరియల్స్' (పీసీఎం)గా పిలిచే ప్రత్యేకమైన కూలింగ్ కెమికల్‌తో తయారయ్యే ఈ పౌచ్‌లను కొన్నిగంటలు ఫ్రిజ్‌లో పెడితే చాలు..వాటిలోని ఆ లిక్విడ్ దాదాపు పదిగంటలపాటు చల్లగా ఉండి..బాక్సులోని పదార్థాలు చెడిపోకుండా తాజాగా ఉంచుతుంది. పైగా ఈ పోర్టబుల్ కోల్డ్ స్టోరేజీ వల్ల ఎలాంటి కర్బన ఉద్గారాలూ విడుదల కావు. ఈ ప్రాజెక్టు పర్యావరణహితం కావడంతో ఐరాస పారిశ్రామిక అభివృద్ధి సంస్థ 'టాన్90'కి ఆర్థిక ప్రోత్సాహం అందించింది. ఐదేళ్ల క్రితం చెన్నైలో ప్రారంభమైన టాన్90 మొదట తమిళనాడులో చిరువ్యాపారులకు పోర్టబుల్ కోల్డ్‌స్టోరేజీలను అందించింది. ఆ వ్యాపారులు వాటితో లాభపడటం వల్ల ఈ సంస్థకు ఆదరణ పెరిగింది. క్రమంగా ఇతర రాష్ట్రాలకూ సేవల్ని విస్తరించి ప్రస్తుతం 12 రాష్ట్రాల్లోని రైతులకు తమ ఉత్పత్తుల్ని చేరవేశారు. కొన్ని కార్పొరేట్ సంస్థలూ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఏపీ, తెలంగాణ సన్నకారు రైతులకు ఈ కోల్డ్ స్టోరేజీలను సమకూరుస్తున్నాయి. ఐస్‌క్రీమ్‌ల నుంచి వ్యాక్సిన్ల వరకు నిర్దేశిత ఉష్ణోగ్రత ఉండేలా చూస్తూ ప్రత్యేకంగా బ్యాగులూ, బాక్సులూ రూపొందిస్తున్న టాన్90 వినియోగదారుల జాబితాలో స్విగ్గీ, జొమాటో, జెప్టోలాంటి పెద్ద సంస్థలు సైతం చేరడం విశేషం.

# భువిని దివిని చేద్దాం



ఆదివారం కవిత్వం

**భువిని** దివిని చేద్దామురా
సుఖాలని స్వంతం చేసుకుందామురా
మంచిమాటలు చెప్పనా
మేటిపనులను చేయమననా
మొక్కలను పెంచరా
మహిని పచ్చపరచరా
పువ్వులను పూయించరా
పొంకాలు చూపించరా
వెలుగులు వెదజల్లరా
తమసును తరిమెయ్యరా
పరిమళాలు చల్లరా
పరిసరాలు పులకించరా
చిరునవ్వులు చిందించరా
మోములను వెలిగించరా
తేనెచుక్కలు చల్లరా
తీపి పలుకులు వినిపించరా
అమృత జల్లులు కురిపించరా
అధరాలను గ్రోలుకోమనరా
శక్తి సామర్థ్యాలు చూపరా
యుక్తి చేష్టలను చెయ్యరా
మంచితనమును చేపరా
మానవత్తమును చాటరా
మదులను ముట్టరా
హృదులను తట్టరా
చక్కదనాలను చూపరా
సంతసాలను కలిగించరా
ఈర్ష్యాద్వేషాలు విడువరా
కక్షకార్పణ్యాలు వదలరా
మమతానురాగాలను చూపించరా
మానవ బంధాలను వృద్ధి చెయ్యరా
మనసులను సృజించరా
మానవులను మురిపించరా
భూలోకమును స్వర్గముగా చేద్దామురా
మనుజులను సురలుగా మారుద్దామురా

**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**



# మధుర జ్ఞాపకం

అప్పుడెప్పుడో
ఆమె రాసిన ఉత్తరం
పది కాలాల పాటు ఎప్పటికీ
నా మది గదిలో పదిలమే!
ఎందుకంటే
తన 'అధరామృతం'తో
తపాలబిళ్ళ
అతికించిందని తెలిసి.

**- తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి**



# మకుటం



శబ్దం గద్దెనెక్కి
నిశ్శబ్దం పరాజయం
అవినీతి అశ్వమేధమై
స్వార్థానిది జయకేతనం!

అనుశాసన వలయంలో
ప్రజాస్వామ్యం బందీయై
ఇచ్ఛకు స్వరం లేక
స్వేచ్ఛకు చలనం లేక
జన జీవనం!

చెమ్మ తగిలిన విత్తు
మొగ్గ తొడిగి
ప్రజాపీఠంపై
రణస్థలి నిర్మాణం
శబ్దం విజయమై
నిశ్శబ్దం గద్దెనెక్కి
జనావళికి మకుటం!


**- అడిగోపుల వెంకటరత్నమ్**



## పిల్లల కథలు 'కహానీదాన్'

ఇది పిల్లల కోసం రాసిన కథలు. రచయిత చిన్నప్పుడు విన్న కథలనే ఈ 'కహానీదాన్' అనే కథల పెట్టెలో పొందుపరిచారు. ఇవి పిల్లలకు ఆనందాన్ని కలిగిస్తాయి. రాత్రిళ్లు పడుకొనే ముందు తల్లిదండ్రులు లేదా నాయనమ్మనో, తాతయ్యనో కథలు చెప్పి పిల్లల్ని నిద్రపుచ్చుతారు. పిల్లలకు చిన్నకథలే ఇష్టం. రాజకుమారి, రాజకుమారుడు కథలు బాగా ఆసక్తిగా వింటూ నిద్రపోతారు. ఈ పుస్తకంలో 25 కథలున్నాయి. అన్నీకథలు 2,3, పేజీల్లోనే వుంటాయి. ఆసక్తి గల్గించేలా లక్ష్మణ్‌రావుపతంగే రాసారు. రాజు-దర్జీ, పులిని ఓడించిన గాడిద బిర్యానీ, పిసినారి పుల్లయ్య, కోపిష్టి కొమరయ్యలాంటి కథలు పిల్లలకు ఆసక్తి కల్గిస్తాయి. 'రాజు-దర్జీ' కథలో రాకుమారునికి బంగారు బట్టలు కుట్టిన దర్జీ తన కుమారునికి ఆ బంగారుబట్టతో బట్టలు కట్టి ఊరేగింపుకు తను కుట్టిన బంగారు వస్త్రాలు ధరింపజేసి తీసుకెళతాడు. 'అదృష్టం ఉంటే ఎటూ పోదు' (పేజి.50) కథలో దైవవిశ్వాసం ఉంచి జీవించాలనే నీతి చెబుతుంది. 'దేనేవాలా ఛప్పర్ ఫాడ్‌కేదేతాహై' అన్న నానుడికి అర్థంగా ఈ కథ వుంటుంది. గోవిందరావు అనే మోతుబరు తన చెప్పులో బంగారు వుంచి వీధిలో విసురుతాడు. అది ఊరంతా తిరిగి తిరిగి రాజయ్య ఇంటి ముందు వాకిట్లో చెప్పును గోవిందురావు ఇంటిపైకి విసిరేస్తాడు. అందులోని బంగారం భద్రంగా వుంటుంది. ఇలా అన్ని కథలూ చదివిస్తాయి. **(కహానీదాన్, రచన: లక్ష్మణ్‌రావు పతంగే, ప్రతులకు: నవోదయ, నవతెలంగాణ, నవచేతన బుక్‌హౌస్‌లు)**

**- తంగిరాల చక్రవర్తి**



## జాతీయ సమస్యల సమాహారం

జన్నాభట్ల నరసింహ 'ప్రసాదించిన' వ్యాసమంజూష లో 31వ్యాసాలు, 23 గ్రంథసమీక్షలు 12 కవితలు న్నాయి. ఈ కవిశేఖర బిరుదాంకితులు తాను కవి, కథకుడినే కాదు., అంతే సత్తాగల వ్యాసకర్తనని, సమీక్ష కుడినని రుజువు చేసుకున్నారు. వ్యాసాలు రాయటం అంత 'ఆషామాషే' వ్యవహారం కాదు. అంతర్నేత్రంతో జరిగిన జరుగుతున్న జరుగబోయే స్థితిగతుల్ని సరిగ్గా బేరీజు వేయగలిగిన సామర్థ్యం ఉండాలి. వివరించిన వస్తువు సమకాలీన సమస్య అయిఉం డాలి. వీటన్నింటినీ రచయిత చక్కగా ఔపోసన పట్టినవాడు కనుకనే ఈ పేటిక నిండా, వెలకట్టలేని రత్నరాసులున్నాయి. ఇవన్నీ నేటి భారతం ఎదుర్కొంటున్న సమస్యలు. ఉదాహరణగా మొదటివ్యాసం 'కాశ్మీర్ కార్చిచ్చు ఆరేదెప్పుడు?' సమస్య మూలాల్లోకి వెళ్లాడు. ఎలా ఉత్పన్నం అయిందీ వివరించారు. నాటి పాలకులు, నేటి పాలకులు తీసుకున్న చర్యలు ఉటంకించారు. సమస్యకు పరిష్కారం వ్యాసం చివర సూచించారు. పడిపోతున్న రూపాయి విలువను ప్రస్థావించి తాను ఆర్థికవేత్తనని కూడా నిరూపించుకున్నారు. డా॥ముదిగొండ శివప్రసాద్, ముదిగొండ ఉమాదేవి, సుధామ, హాస్యబ్రహ్మ శంకరనారాయణ, అక్కిరాజు సుందరరామకృష్ణ ప్రభుతుల పుస్తకాలలోని ఎన్నో ఆసక్తికరమైన అంశాల్ని పొందు పరిచారు. చర్చకు తీసుకున్న అంశాలులో సింహభాగము జాతీయ సమస్యలు. రచయితకు అభినంద నలు. **(వ్యాసమంజూష, రచన: జన్నాభట్ల నరసింహప్రసాద్, వెల రూ: 150, ప్రతులకు: ఇ.నెం. 1-207, ప్లాట్‌నం. అరవిందనగర్ నాగారం, హైదరాబాద్)**

**- కూర చిదంబరం**

**పుస్తక సమీక్ష**

ప్రస్తుత సమాజపు పోకడలను దృశ్యీకరిస్తు 'విశ్వగీతం' పేరిట ఓ గేయ దృశ్యకావ్యం వెలువరించారు చకిలం కొండా నాగేశ్వరరావు. ఈయన కలం పేరు 'చకొనా'. ప్రపంచ వ్యాప్తంగా నేటి మానవ సంబంధాలు, మతాలు, కులాలు, దేవుళ్లు, దయ్యాలు అన్నింటికన్నా ప్రధానంగా డబ్బు, పర్యావరణం, ప్రపంచ రాజకీయాలు, కార్మికులు, రైతులు, యువతరం వేదనలు వస్తువు



## చకొనా ఆలపించిన 'విశ్వగీతం'

లుగా స్వీకరించడం వల్ల ఈ కావ్యం విశ్వగీతం అయిందని చెప్పుకొచ్చారు చకొనా. 'పునాదిలేదు..శ్రమ చేయరు/ సౌధమెలా కడతారు?' అంటూ బద్ధకస్తులైన ప్రజల్ని నిలదీస్తారు. మరో అడుగు ముందుకేసి 'సిగ్గులేదా నీకు అని/ నిగ్గదీసె మనసు/ నిప్పులోన తోసినా/ మారదు నీ తీరు/ సిగ్గుకైనా సిగ్గేసె/ ఎడ్డిబ్రతుకులాగేవు' అని ఛీదరించుకుంటారు. కావ్యమంతటా కవి సామాజిక దృక్పథం పరచుకుని వుంది. మూడు దశాబ్దాలుగా కవనసేద్యం చేస్తున్న 'చకొనా' నాలుగవ కవితాసంపుటి యిది. విశ్వమానవ కల్యాణం ఆకాంక్షించే ఈ కవి పుట్టుకనుండి చావుదాకా జీవితమే పోరాటం అని అభిప్రాయపడ్డారు. 'పోరాటం కొత్తకాదు/ పోరాడితే పోయేది లేదు/పుట్టుక -బ్రతుకు -మరణం/ అనుక్షణం రణం-రణం' అంటు మనిషి జీవితాన్ని దృశ్యమానం చేస్తారు. ప్రముఖ కవి కె.శివారెడ్డి అభిప్రాయపడినట్లు 'ఇది వచన కవిత్వం కాదు..ఒక నడవడిక కలిగిన మాత్రాఛందస్సు'. **(విశ్వగీతం, రచన: చికిలం కొండల నాగేశ్వరరావు, వెల: రూ 125, ప్రతులకు: విశాలాంధ్ర, నవోదయ బుక్‌హౌస్‌లు)**

**- రమణ వెలమకన్ని**

సముద్రాన్ని తల్లిగా, దైవంగా భావిస్తూ అందులోని జలచరాలపై ఆధారపడి బ్రతుకు ఈదుస్తున్న జాలర్ల జీవితాల గురించి పోట్లూరు సుబ్రహ్మణ్యం 21 కథలు సముద్రతీర కథలుగా ప్రచురింప చేసారు. నాగరిక సమాజానికి దూరంగా సముద్ర జల



## సముద్ర తీర కథలు

చరాలతో ముడిపడిన మత్స్యకారుల జీవితాలను రచయిత అద్భుతమైన కథలుగా చిత్రీకరించారు. కథలలో వస్తువైవిధ్యం, సన్నివేశాలు, మనస్తత్వ చిత్రణలు ఆసక్తికరంగా చదివింపచేస్తున్నాయి. ఈ కథలలో సముద్రం, జాలర్ల జీవితాలకు అనుబంధం, వాళ్ల జీవనస్థితిగతులు రచయిత వాస్తవంగా చదువరుల కళ్లముందు కదిలింపచేసారు. ప్రతీకథ హృదయాన్ని స్పృశిస్తుంది. మొదటి కథ 'రొయ్యలపాలెం-గవ్వలపాలెం', 'చివరికథ' చేసుకొన్న బాసలు 'ప్రేమబంధంతో' ముడిపడ్డ గొలుసుకట్టుకథగా నడుస్తుంది. 'ముసలివాడు-సముద్రపు మొసలి', పగపట్టిన మనిషి పటిమపట్టుదల ప్రదర్శింపచేస్తుంది. తిమింగలాన్ని బతికించుకోవాలనే జాలర్ల తపన, రొయ్యల్ని తినే తాబేలు దొర కథనం, జెల్లీ చేపలతో ఎదుర్కొనే ప్రాణాపాయం, గంగానమ్మకు సేతబడి, చేపలవేట ఆట కాదు ప్రాణాలతో చెలగాటం, అన్నికథలు సముద్రపు లోతులలో తిరిగే జీవులతో, ఒడ్డున నివసించే నిరుపేద చెస్తల జీవన ఆరాట పోరాటాలను వ్యక్తీకరిస్తున్నాయి. **(సముద్రతీర కథలు, రచన: పోట్లూరు సుబ్రహ్మణ్యం, వెల: రూ 250, ప్రతులకు: విశాఖ ప్రియమైన రచయితల సాహిత్య సంక్షేమ సంఘం, విశాఖపట్నం)**

**- యర్రమిల్లి**



# చెదరిపోని నవ్వుకోసం..

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

**మానవ** జీవితం ఓ అద్భుతవరం. జీవనయానంలో అనుకున్నవి, అనుకోనివి జరుగుతూనే ఉంటాయి. నవ్విన క్షణాలు, బాధపడిన ఘడియలు మనంద రికీ నిత్యఅనుభవమే. జీవన గమనానికి ఓ ప్రణాళిక వేసుకుంటాం. పథకం ప్రకారం జరిగితే పరమానందపడతాం, ఊహించని అవాంఛనీయమైన ఘటనలు జరిగినపుడు చింతించడం సాధారణం అయ్యింది. జీవితం ఓ రోడ్డు ప్రయాణం. రోడ్డంటే అద్దంలా ఉండడమే కాదు, మార్గాన స్పీడ్ బ్రేకులు, గుంతలు, భయంకర మలుపులు, ప్రమాదభయాలు ఉంటాయి. మరణం అనివార్యమని తెలిసినా అతిగా దుఃఖించడం హాస్యాస్పదం. జననంతోనే మరణం కూడా నిశ్చయించబడిందని మరువరాదు. ఇలాంటి సుఖదుఃఖాల, కష్టనష్టాల జీవితాన్ని చిరునవ్వుతో ఎదుర్కొని, అనుక్షణం ఆస్వాదించగలగడం ఓ అద్వితీయ కళ. చింతలు చిదిమేసి సంతోషంగా జీవించడానికి అనేక అంశాలు, మార్గాలు దోహదపడతాయి.

➤ ఆశావహ దృక్పథం సదా ఆరోగ్యదాయకం. దురాలోచనలు, దురుద్దేశాలు అనారోగ్యదాయకం. పక్కా ప్రణాళిక విజయాన్ని దగ్గరకు చేర్చుతుంది. అనవసరం ఆందోళనకూ ఆస్కారం ఇవ్వొద్దు.

➤ సమస్యలు లేని జీవితం లేదు. సమస్యకు సమాధానం వెదకడం, సఫలత కోసం సర్వశక్తులు ధారపోయడం అలవాటు చేసుకోవాలి. ఫలితాన్ని అతిగా ఊహించుకొని మానసిక ఒత్తిడికి గురికాకూడదు. సత్ఫలితం రానపుడు అంగీకరించడం, తదుపరి నవ్వ అడుగులను అన్వేషించడం ఉత్తమం.

➤ సంపూర్ణ విషయపరిజ్ఞానం లేకుండా కార్యానికి పూనుకోరాదు. కార్యసాధనకు సమాచార సేకరణ, లోతైన విశ్లేషణ, బహుముఖీన కోణంలో ఆలోచనలు చేయాలి. కొద్ది అవగాహనతో ప్రారంభిస్తే అపజయానికే అవకాశాలు ఎక్కువ. కీడెంచి మేలెంచుదాం.

➤ సమస్య ఏమిటి? సమస్యకు కారణాలేమి? సమస్య పరిష్కారానికి మార్గలు ఏమిటి? వీటిలో ఉత్తమ మార్గాన్ని ఎన్నుకోవడంలో సఫలమైతే గెలుపు పునాదులు సిద్ధించినట్లే.

➤ బిజీగా ఉందాం. ప్రతి క్షణం పనిలో నిమగ్నం అవుదాం. అనవసర ఆలోచనలకు సమయం ఇవ్వవద్దు. అనవసర చింతతో నిరాశ ఆవరించి ఫలితాన్ని ప్రభావితం చేస్తుంది.

➤ భౌగోళిక కాలమానంలో మన జీవితకాలం చాలా చిన్నది. నిన్నటి ఓటమి నేటి కార్యదక్షతను రెట్టింపు చేయాలి. ఒకే సమస్యను అనేకసార్లు తలిచి వగచి రోజులు, వారాలు, నెలలు, ఏండ్లు ఏడ్వరాదు.

➤ చిన్న సమస్యను పెద్దగా ఊహించరాదు. మనకు సాధ్యమైన, అసాధ్యమైన సమస్యలు ఉంటాయి. అసాధ్యమని తెలిసి, ప్రయత్నించి విఫలమైతే చింత మాత్రమే మిగులుతుంది.

– కంట్లో ఆనంద భాష్పాల్ని నింపుకుందాం. దుఃఖంతో కన్నీరు కార్చడం తగదు. కన్నీటితో పరిస్థితులు తారుమారు కావు. కన్నీళ్లను చెమట చుక్కలుగా మార్చుకుందాం.

➤ పొరపాటు మానవ సహజం. తెలిసి పొరపాటు చేసినపుడు లభించే దుష్ఫలితాన్ని అనుభవించాల్సి ఉంటుంది. చేసిన తప్పును మరోసారి పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. గతాన్ని మార్చడం ఎవరితరం కాదు. ప్రస్తుతం, భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది.

➤ మన మానసిక దృక్పథమే చైతన్యానికి లేదా చింతకు కారణమని తెలుసుకుందాం. మన సదాలోచన/ దురాలోచనలే మనకు ప్రతిక్షణం మనకు సంతోష/ బాధలకు హేతువులు అవుతున్నాయి.




➤ నరకంలో స్వర్గాన్ని లేదా స్వర్గంలో నరకాన్ని చూడగల సామర్థ్యం మనసుకు ఉందని గుర్తుంచుకుందాం.

➤ శత్రువులు, విమర్శకులు లేదా వ్యతిరేకుల గూర్చి అతిగా ఆలోచిస్తే ఆవేశం పెరిగి, చింతకు దారితీస్తుంది. శత్రువును కాదు సమస్యను జయించడం నేర్చుకుందాం.

➤ కృతజ్ఞతను పోషిద్దాం. చేయూతను ఇచ్చిన చేతులకు దండం పెడదాం. కృతజ్ఞతాభావన మనలో సంతోషాన్ని నింపుతూ, చింతను పారద్రోలుతుంది.

➤ ఒకరిని అనవసరంగా నొప్పిస్తే అది మన అంతరంగాన్ని గాయపర్చుతుంది. సానుభూతి కాకుండా సహానుభూతిని అలవాటు చేసుకుందాం. విరోధిలో స్నేహితున్ని చూడడం, కీడు చేసిన వారికి మేలు చేస్తూ సమాధానం ఇవ్వడం సరైన మార్గమని నేర్చుకుందాం.



➤ పొరపాట్ల చింతనుకాదు, కసి పట్టుదలను పెంచేలా చూసుకుందాం. మనం చేసిన పొరపాట్లను విశ్లేషించుకోవడం, దాని నుండి గుణపాఠం నేర్చుకోవడం, పనరావృతం కాకుండా చూసుకోవడంతో నిరాశ దూరం అవుతుంది.

➤ ఇతరులతో మన ప్రవర్తనే తిరిగి మనకు ప్రతిచర్యగా కనిపిస్తుంది. మంచిని మాట్లాడడం, మంచిని చేయడం మనల్ని సంతోష వర్షంలో ముంచుతుంది.

➤ మనల్ని చూసి ఈర్ష్యపడే వారు ఉంటారు. పరుల ఈర్ష్యను మన విజయంగా భావిద్దాం. సద్విమర్శను స్వాగతిద్దాం.

➤ భావోద్వేగ వికారంతో చింత, నిరాశ, ఆగ్రహం జనిస్తాయి. శారీరక ఒత్తిడి కన్న మానసిక ఒత్తిడి ప్రమాదకరమే కాదు చింతకు కూడా కారణం అవుతుంది.

➤ మనం చేసే పనిని ప్రేమిద్దాం. ఇష్టంగా పని చేస్తే కష్టం అనిపించదు. సమయం తెలికగా గడిచిపోతుంది, సత్ఫలితాలకు సంతోషాలకు దారి తీస్తుంది.

➤ ప్రతి చిన్న సత్ఫలితాన్ని సంతోషంగా ఆస్వాదిద్దాం. దురాశదుఃఖానికి హేతువని గుర్తుంచుకుందాం. ఏ ఫలితం వచ్చినా నిండు మనసుతో అంగీకరిస్తే చింతలు దూరం అవుతాయి.

➤ ఏమి చేయకుండా కూర్చోవడం అంటే విశ్రాంతి తీసుకోవడం అని కాదు. విశ్రాంతి తీసుకొనే సందర్భంలో మన అభిరుచుల్ని ఆస్వాదిద్దాం.

➤ ఆర్థిక ప్రణాళిక వేసుకొని, ముందుకు సాగేవారు ఆనందంతో కనిపిస్తారు. ఆర్థిక సమస్యలు మానసిక ఒత్తిడిని కలిగిస్తాయి.

➤ అన్ని విమర్శల కన్న ఆత్మవిమర్శే మిన్న అని తెలుసుకుందాం. మన అంతరాత్మకే మనం సమాధానం చెప్పాలి, ఇతరులకు కాదు.

➤ పొగడ్తలకు పొంగిపోవడం, విమర్శలకు కుంగిపోవడం మానేద్దాం. మన జీవితం ఇతరుల కోసం రాదు.

➤ ప్రతి వస్తువుకు గరిష్ట అమ్మకం ధర ఉంటుంది. అంతకన్న ఒక్కపైసా కూడా ఎక్కువగా చెల్లించడానికి అంగీకరించం కదా. అలాగే ప్రతి సమస్యకు అవసరమైన ఆలోచనలు చేయాలి. స్వల్ప సమస్యకు అతి ప్రాధాన్యత ఇవ్వడం చింతకు కారణం అవుతుంది. సమస్యకు అనేక ప్రతికూలతలను ఆపాదిస్తూ, అతిగా ఆలోచనలు చేయవద్దు. సూక్ష్మ సమస్యకు స్థూలంగా ఆలోచించడమే చింతకు ప్రధాన కారణం. మన చేతుల్లో లేని విషయాలను మనకు అనుకూలంగా ఆలోచించరాదు.

అసాధ్యాలకు అతిసమయం వెచ్చించరాదు. ఒకరి మెప్పు కోసం చూడవద్దు. సత్కార్యానికి సర్వశక్తులొడ్డి ప్రయత్నించడమే మన చేతుల్లో ఉంది. అనుకూల/ప్రతికూల ఫలితాన్ని ఆజ్యం పోసినట్లే అవుతుందని అర్థం కావాలి. సద్భావనలు, సత్కర్మలు, నిస్వార్థ భావనలు చింతను దూరం చేస్తూ, ఆనందపు అంచులను పరిచయం చేస్తుంది.

జీవితంలో ప్రతి క్షణం సంతోషంగా గడపాలి. చింతకు అవకాశం ఇచ్చినప్పుడు ఆరోగ్యం క్షీణిస్తుంది. చింతించుట ఓ మానసిక వ్యాధి. చింత అనేది మనసుకు పట్టిన చెదలుగా అంగీకరిద్దాం. చీకూచింతలకు దూరంగా, సంతోషపు అంచులకు దగ్గరగా సంపూర్ణ శారీరక మానసిక వికాసంతో జీవితాన్ని ఆసాంతం ఆస్వాదిద్దాం.

○

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త,
నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

కథ

# అందరం ఒక్కటే

అనగనగా ఓ కుక్క తన నాలుగు పిల్లలతో నడచుకుంటూ ఓ వీధిలో వెళుతోంది. దాని పిల్లల్లో రెండు తెల్లగా రెండు గోధుమరంగులో ముద్దుగా ఉన్నాయి. అవన్నీ అలా కొంత దూరం వెళ్లేసరికి ఓ సందులో నుండి ఓ నల్లకుక్కపిల్ల బాధగా ఏడుస్తూ ఈ కుక్క పిల్లలవైపు వచ్చి తల్లి కుక్కవైపు దీనంగా చూడసాగింది.



'అమ్మా ఆ కుక్క నల్లగా భయంకరంగా ఉందే' అని భయపు కళ్లతో తల్లి కుక్కవైపు చూస్తూ అన్నాయి!

'తప్పమ్మా మనలో కొన్ని కుక్కలు నల్లగా పుడతాయి. కొన్ని తెల్లగా కొన్ని పూర్తి గోధుమరంగులో పుడతాయి. అంతమాత్రాన అవి చెడ్డవికావు. పాపం దానికి తల్లి లేనట్టుంది దానిని కూడా మనతోనే తిరగనిద్దాం. అది మీకన్నా కొంచెం పెద్దదిగా ఉంది. దానిని 'అన్నా' అని పిలవండి అది సంతోషిస్తుంది' అని చెప్పింది తల్లి కుక్క.

'సరేనమ్మా నీవు చెప్పినట్టు 'అన్నా' అని పిలుస్తాం. అన్నతో ఆడుకుంటాం' అని సంతోషంగా చెప్పి నల్లకుక్కను ఆప్యాయంగా దగ్గరకు రానిచ్చాయి. ఇప్పుడు అన్నీ కలసి ఆనందంగా నడచుకుంటూ వెళ్లసాగాయి.

'మీ అమ్మ ఏమయింది?' అడిగింది తల్లికుక్క.

'మా అమ్మను కొందరు మనుషులు కుక్కలబండీలో తీసుకునివెళ్లిపోయారు. అప్పటి నుండి ఒంటరిగా భయంతో బతుకుతున్నాను. ఏమయిపోయిందో మా అమ్మ' అని కళ్లలో నీళ్లు నింపుకుని చెప్పింది నల్లకుక్క.

విషయం అర్థమైంది తల్లి కుక్కకి. 'అయ్యో అలాగా' అన్నది తల్లి కుక్క.

కుక్క పిల్లలన్నింటినీ తీసుకుని తల్లి కుక్క కొంత దూరం వెళ్లేసరికి దూరంగా కుక్కలబండి రావడం ముందుగా నల్లకుక్క చూసింది. వెంటనే అది తల్లికుక్కను అప్రమత్తం చేసి గబుక్కున ఓ చెట్టు గుబురు చాటుకు పిల్లలన్నింటినీ తీసుకువెళ్లి ఆత్రం అరవడం కానీ శబ్దం చేయటం కానీ చేయవద్దని చెప్పింది. నల్లకుక్క చెప్పినట్టే అన్నీ గుబురుచెట్టు చాటుకి వెళ్లి నిశ్శబ్దంగా ఉండిపోయాయి. కుక్కలబండి వీటి వరకు రాలేదు. అది మరోవీధిలోకి వెళ్లిపోయింది.

'చూసారా పిల్లలూ రంగుని చూసి బుద్ధిని అంచనా వేయ్యకూడదు. ఆ కుక్క నల్లగా ఉన్నా దానికి మంచి మనసుంది. నన్నూ మిమ్మల్ని కాపాడాలని అది వెంటనే గుబురు చెట్టు వద్దకు తీసుకునివెళ్లింది' అన్నది తల్లి కుక్క.

'అవునమ్మా నల్లకుక్క అన్న ఎంతో మంచివాడు' అని ముక్తకంఠంతో అన్నాయి పిల్లకుక్కలు. వాటి మాటలకు తల్లికుక్క సంతోషించింది.

**– కంచనపల్లి వేంకట కృష్ణారావు**

## చుక్కలు కలపండి



వార్త ఆదివారం

## బాలగేయం

### వరాల మామిడి



వచ్చిందమ్మ వచ్చింది
వేసవికాలం వచ్చింది
నోరూరించే తియ్యనీ
వరాల మామిడి తెచ్చింది
భగభగ మండే వేళలో
ధగధగ సెగల మంటల్లో
బంగినపల్లీ పందిరై
వేగిరమే రా రమ్మంది
బంగారు మేని ఛాయతో
సింగారాల బుగ్గలతో
సిగ్గుల మొగ్గలు వేసింది
మాగిన మధువే చిలికింది
ఉలవపాడు
మామిడి పండ్లు
తలచుకుంటే తేనెలూరు
గిజిగాడి ఊయలే ఊగు
నూజివీడు రసాలె త్రాగు.

**- గుండాల నరేంద్రబాబు**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- పి.అభీర,** నాందేడ్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కీటకాలకు చెవులుంటాయా?**

**జవాబు: అభీర!** మనకు వున్నట్లు క్రిమికీటకాలకు చెవులు ఉండవు. అయినప్పటికీ అవి ధ్వనిని గ్రహిస్తాయి. మన చెవిలో వినికిడికి అవసరమైన 'ఇయర్ డ్రమ్' వున్న తరహాలోనే వాటి శరీరంలో 'టింఫానిక్ లేయర్ డ్రమ్' (వినికిడిశక్తి గల పొర అని చెప్పవచ్చు) ఉంటుందని శాస్త్రవేత్తలు వివరించారు. ఆ వివరాల ప్రకారం వినికిడికి ఉపయోగపడే ఈ టింఫానిక్ లేయర్ కొన్ని కీటకాల్లో బాహ్య అస్థి పంజరంలో ఉంటుంది. మరికొన్నింటిలో ముందు కాళ్లల్లోగానీ, ఉదరం కిందగానీ ఉంటుంది. కొన్ని కీటకాలలో అయితే ప్రత్యేకంగా వాటి చర్మం మీద వున్న వెంట్రుకలే శబ్దాలను వింటాయి. సహజంగా కీటకాలు తమ తోటి కీటకాలను కలుసుకోవడానికి శబ్దాలను చేయడం అలవరచుకుంటాయి. కొన్ని కీటకాలయితే తమను తాము రక్షించుకోవడానికి శబ్దాలను ఉపయోగించుకుంటాయి. ఉదాహరణకు గబ్బిలాలు ఎగురుకుంటూ ఆహారాన్ని అన్వేషించే సందర్భంలో వెలువడే శబ్దాలను గ్రహించిన కొన్ని రకాల కీటకాలు, పురుగులు తమను తాము కాపాడుకుంటాయి.

**- ఎస్.మనీష్,** గుంటూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాన పడేముందు మబ్బులు నల్లగా ఎందుకు ఉంటాయి.?**

**జవాబు: మనీష్!** వర్షం పడే ముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి కదా. వీటి మీద కాంతి ప్రసరించినప్పుడు ఆ బిందువులు పరా వర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి. వాన పడే ముందు నీటి బిందువుల సంఖ్య పెరుగుతుంది. అందువల్ల వానపడేముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.

# ఉడుపి హోటల్ ప్రసిద్ధి

**నిజానికి ఉడిపి కాదు, ఉడుపి అని రాయాలి. ఉడుపీ అంటే అర్థం నక్షత్రాలకు అధిపతి అయిన చంద్రుని భూమి అని అర్థం. ఇక ఉడుపి వంట లేక భోజనం. దీని మూలం ఉడుపిలో ఉన్న కృష్ణదేవాలయం లో, అష్టమఠాలలో ఉంది. ఉడుపి శ్రీ మధ్వాచార్యులు జన్మించిన ఊరు. ఇది ద్వైత సాంప్రదాయ ముఖ్యకేంద్రం.**

అన్నదాన సేవలో భాగంగా ఉడుపిలోని శ్రీకృష్ణ దేవాలయంలో శిక్షణ పొందిన వంటవారు ఉడుపి హోటళ్లను తెరవడానికి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలివెళ్లారు. మరీ ఉడుపి భోజనానికే ఎందుకంటే పేరుగాంచిందంటే..



## యుద్ధంలో పాల్గొన్న సైన్యం కోసం..

ఇంట్లో మనం నలుగురికి లేదా ఐదుగురికి వంట చేయగలం. అంతకంటే ఎక్కువ మందికి చేయటం కొంచెం కష్టమైన పని. మరి 50 లక్షలమందికి వంట చేయడం అంటే మామూలు విషయం కాదు. మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధ సమయం లో 50లక్షల మంది పాల్గొన్నారు. వారికి వంట వండినవారు ఎవరంటే? మహాభారత యుద్ధంలో కౌరవుల పక్షాన కొందరు పాండవుల పక్షాన కొందరు ఇలా అందరూ కలిసి దాదాపు 50లక్షలకుపైగా కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్నారు. కానీ ఇంత జరుగుతున్నా ఇద్దరు రాజులు పాల్గొనలేదు. అందులో ఒకరు విదర్భ రాజైన రుక్మి, రెండవరాజు బలరాముడు. ఆ ఇద్దరు తప్ప అన్ని రాజ్యాలు పాల్గొన్నాయి. దక్షిణ భారతంలోని ఉడుపి రాజ్యం కురుక్షేత్ర యుద్ధానికి వచ్చింది. ఉడుపిరాజైన నరేషుడు సైన్యాన్ని తీసుకొని యుద్ధ ప్రాంతానికి వెళ్లినప్పుడు కౌరవులు తమవైపు నిలబడాలని మరోవైపు పాండవులు తమవై నిలబడాలని కోరుతారు. అప్పుడు ఉడుపి రాజు తన తెలివితో ఎటూ వెళ్లకుండా సలహా కోసం శ్రీకృష్ణ దగ్గరికి వెళ్తాడు. అందరూ యుద్ధం గురించే ఆలోచిస్తున్నారు మరి ఇన్ని లక్షల మందికి భోజనాలు గురించి ఏమైనా ఆలోచించారా? ఎవరు వండి పెడతారు? అని శ్రీకృష్ణుడిని అడుగుతాడు. 'మీరన్నది నిజమే మరి మీ దగ్గర ఏదైనా ఆలోచన ఉందా?' అని కృష్ణుడు అడుగుతాడు. అంతేకాదు ఇది మీ వల్లే సాధ్యమవుతుందంటూ అందరికీ భోజనాలు తయారు చేయమని చెబుతాడు శ్రీకృష్ణుడు. నిజానికి 50లక్షల మందికి భోజనాలు వండాలంటే భీముడు, అతని సైన్యానికి మాత్రమే వీలవుతుంది. కానీ ఈ సమయంలో పోరాడటం భీముడికి ముఖ్యం. అందువల్ల భీముని యుద్ధక్షేత్రం వదిలి రాలేదు. అందువల్ల నువ్వొక్కడివే ఇంతమంది సైన్యానికి వంట చేయగల సమర్థుడు అని వండమని కోరతాడు శ్రీకృష్ణుడు. నరేషుడు తన సైన్యంతో కలిపి అక్కడ ఉన్న సైన్యాలకు భోజనం తయారు చేస్తాడు.

## ఎలా వండేవాడంటే..

సాయంత్రం వరకు తాను వండిన భోజనం ఒక్క మెతుకు కూడా మిగలకుండా, వృధాకాకుండా వండేవాడు. రోజులు గడుస్తున్న కొద్దీ సైన్యం కూడా తగ్గిపోయేది. అయినా సరే వంట మాత్రం అందరికీ సరిపోయేలా వండేవాడు నరేషుడు. ఇది చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. ఇది ఎలా సాధ్యం? అంతమంది చనిపోతున్నా చివరికి మిగిలిన వారికి మాత్రే సరిపోయెలా ఎలా వంట చేస్తున్నారు? అది కూడా ఒక్క మెతుకు కూడా మిగలకుండా ఎలా వండుతున్నారు?



అని అందరూ ఆశ్చర్యానికి గురయ్యేవారు.

అసలు నరేషునికి ఎలా తెలుస్తుంది. ఈరోజు ఇంతమంది మాత్రమే చనిపోతారని, మిగిలిన వారికి మాత్రమే భోజనం వండాలి అని? ఇలా 18 రోజులు గడిచిపోయాయి. పాండవులు గెలిచారు. పట్టాభిషేకం జరుగుతుంది. అప్పుడు ధర్మరాజు ఉడుపి నరేషుడుని అడుగుతాడు. మమ్మల్ని అందరూ తక్కువ సైన్యం ఉన్నా గెలిచామని పొగుడుతున్నారు. కానీ నేను మాత్రం నిన్ను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను అని అంటాడు. ఎందుకంటే 50లక్షల మందికి సైన్యమునకు వంట చేయడం అంటే మాటలు కాదు అది కూడా ఒక్క మెతుకు కూడా మిగలకుండా వృధాకాకుండా వండడం అంటే మాటలు కాదు. ఇది మహా అద్భుతం ఇలా ఎలా చేశావు? అని అంటాడు.

అప్పుడు నరేషుడు నవ్వుతూ మీరు గెలియారు కదా దాని గొప్పతనం అంతా ఎవరికి ఇస్తారు అని అడిగాడు? అప్పుడు యుధిష్టరుడు శ్రీకృష్ణుడే దీనికి మూలమని చెబుతాడు. అప్పుడు నరేషుడు మీరు గెలవడానికి కాదు, నేను ఇంతమందికి సరిపడా వంట వండడానికి కూడా శ్రీకృష్ణుడే కారణం. కాబట్టి ఈ గొప్పతనమంతా శ్రీకృష్ణునికే చెందుతుంది అని చెప్తాడు. ఇది విని సభలో ఉన్నవారంతా ఆశ్చర్యానికి గురవుతారు. ఇది ఎలా సాధ్యం? శ్రీకృష్ణుడు ఎలా కారణం అని నరేషుడుని అడుగుతాడు యుద్ధిష్టరుడు. అప్పుడు నరేషుడు అసలు రహస్యాన్ని అందరి ముందు ఇలా చెప్తాడు.. శ్రీకృష్ణుడు ప్రతిరోజు ప్రతి పెసరకాయలు తినేవాడు. నేను లెక్క పెట్టేవాడిని. శ్రీకృష్ణుడు తిన్న తర్వాత మళ్లీ పెసరకాయలను లెక్కపెట్టేవాడిని. శ్రీకృష్ణుడు ఎన్ని కాయలు అయితే తింటాడో దానికి వెయ్యిరెట్లు సైన్యం చనిపోయేవారు. అంటే శ్రీకృష్ణుడు 50 సెసరకాయలు తింటే దానికి వెయ్యిరెట్లు అంటే 50వేల మంది సైనికులు మరుసటి రోజు యుద్ధంలో చనిపోయేవారు. దీనినిబట్టి నేను మిగతా వారికి భోజనం వండేవాడిని అని చెప్పాడు. ఈ కారణం వల్ల ఏ రోజు కూడా భోజనం వృధాకాకుండా వండేవాడిని అని చెప్పాడు. ఇది విన్న ఆ సభలోని వారందరూ కృష్ణలీలకు ముగ్ధులు అవుతారు. ఈ కథ మహాభారత కథలలో ఒక అరుదైన కథ. కర్ణాటకలోని ఉడిపి జిల్లాలోని కృష్ణమందిరంలో ఈ కథ ఇప్పటికీ వినిపిస్తూ ఉంటారు.

ఇదంతా 13వ శతాబ్దంలో కర్ణాటకలోని చిన్న తీర పట్టణమైన ఉడుపిలో ప్రారంభమైంది. ఇక్కడ ఒక ప్రసిద్ధ శ్రీకృష్ణదేవాలయంలో భక్తులకు ఉచిత



భోజనం లేదా అన్నదానం చేసే పద్ధతిని ప్రారంభించింది. మెనూలో ఆహారం ఎప్పుడు వడ్డించాలనే సమయాలు రెండు నిర్ణయించబడ్డాయి. ఈ దేవాలయాలలో శిక్షణ పొందిన వంటవారు చివరికి బెంగళూరు, చెన్నై, ముంబై వంటి దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లి ఈ ప్రాంతాల్లో ఉడుపి హోటళ్లను ఏర్పాటు చేసినట్లు చరిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. ఇక్కడ కృష్ణమఠంకు చాలామంది భక్తులు వస్తారు. వాళ్లు అందరికి ప్రసాదం రూపంలో భోజనం ప్రతిదినం ఇస్తారు. అంతమందికి భోజనం ఇవ్వాలి, అందుకే చాలామంది వంటచేసే బ్రాహ్మణులు ఉండేవారు. ఉడుపిలో చాలామంది బ్రహ్మణులకు వంట చేసే విషయంలో ప్రావీణ్యత దొరికింది. హోటల్ ఉద్యమం ప్రారంభించడానికి ఈ పాకశాస్త్ర జ్ఞానాన్ని ఉపయోగించారు. 1942లో ఉడిపి నుండి ముంబైకి వలస వచ్చిన ఒక యువకుడు మొదటి ఉడిపి శ్రీకృష్ణ హోటల్‌ని స్థాపించాడు. 1950వ దశకంలో ఇద్దరు సోదరులు మావల్లి టిఫిన్ రూమ్ (ఎంటిఆర్), ఉడిపి తరహాలో మరోక హోటల్‌ని ఏర్పాటు చేశారు. 80 సంవత్సరాల వ్యాపారం తర్వాత, ఏంటిఎం ఇప్పుడు ఒక పెద్ద నమ్మకమైన సంస్థగా పరిగణించబడుతుంది.

ఇదంతా గత వైభోగం కాని నేడు దేశవ్యాప్తంగా ఉడుపి హోటల్స్ విలువ అంచున ఉన్నాయి. మన ఆహార సంస్కృతి తీవ్ర ప్రమాదంలో ఉంది. అమెరికన్ ఎమ్ఎన్‌సీలు ఫుడ్ జెయింట్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో ఉడిపి రెస్టారెంట్‌లను తొలగిస్తోంది. దీని పర్యవసానంగా చాలా ఉడుపి ఫుడ్‌జాయింట్‌లు వేగంగా మూసుకుపోతున్నాయి. పదేళ్లక్రితం వరకు దేశంలో ఏ మూలకు వెళ్లినా కుగ్రామంలో కూడా ఉడుపి హోటల్ ఉండి తీరాల్సిందే. ఉడుపి హోటల్ పేరు ఎత్తితే చాలు ఆ రవ్వదోశలు, మసాలా దోశలు, వడ, సాంబారు, ఘుమఘుమలతో కొబ్బరి చట్నీలు.. కానీ నేడు వాటిస్థానంలో నూడుల్స్ సెంటర్లు, పాణిపూరీలు, అమెరికన్ ఎమ్ఎన్‌సీలు పుణ్యమా అని దేశయ చాట్‌సెంటర్లు కూడా కనుమరుగైపోయాయి. మన పిల్లలు జంక్ ప్లాస్టిక్ ఫుడ్స్‌కు అలవాటు పడి చిన్నతన్నం నుంచే తీవ్ర ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. ఈ జంక్‌ఫుడ్స్‌తో స్థూలకాయం, కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయి. అమెరికన్ ఫుడ్ దిగ్గజా లక్ష్యం మన చిన్నారులు, యువతే. ముఖ్యంగా పిల్లల మనస్సును మార్చగలగడమే వారి ధ్యేయం. ఎందుకంటే? మధ్యవయస్కులు, వృద్ధులు ఈ జంక్ ఫాస్ట్‌ఫుడ్‌ను ఎన్నటికీ అంగీకరించరని వారికి బాగా తెలుసు. ఈలోగా చిన్నారులు యుక్తవయస్సు వచ్చేనాటికీ ఈ జంక్‌ఫుడ్స్‌కు బాగా బానిస అయిపోతారు. నిజానికి ఇది మన ఆరోగ్యానికి మాత్రమే కాదు, అందులో ఉపయోగించే పదార్థాలు మనరూపు రేఖల్ని అందవిహీనంగా మార్చేసి మనకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తాయి.

కథ

# ఒక్కడుగు

పంతంగి శ్రీనివాసరావు

“ఇక నీకూ, నాకూ పడదు వినయ్. నీది ఉత్తర దిక్కు, నాది దక్షిణ దిక్కు. నీవి ఎప్పుడూ ప్రతికూల ఆలోచనలే. నాదేమో అనుకూల దృక్పథం. నిన్ను మార్చటం నా వల్ల కాదిక. చట్టబద్ధంగా విడిపోదాం” సానుకూలంగానే చెప్పినా తెగేసి చెప్పింది అభినయ, వినయ్‌కు.

“నీకు ఉద్యోగం లేదు. ఎలా బతుకుతావ్? నా నుంచి మనోవర్తి ఆశిస్తున్నావా?” వెటకారంగా అన్నాడు.

“హు... ఇలా అర్థం చేసుకున్నావన్నమాట. చట్టబద్ధంగా నీ నుంచి రావలసిన మనోవర్తి నాకు అవసరం లేదు. నా ఆత్మవిశ్వాసం ముందు నీ మనోవర్తి అవగింజంత” సూటిగా చెప్పింది అభినయ.

“సరే, నీది టెక్నికల్ క్వాలిఫికేషన్ కాదు. ఒక సాధారణ డిగ్రీ. ఏదయినా మాల్‌లో చేరినా పది వేల లోపే నీ నెల సంపాదన” అతనిలోని ‘అహం’ దెబ్బ తిన్నది.

“అది నీకనవసరం. ఇకనుంచి మనవి వేర్వేరు జీవితాలు. మనసులేని చోట నా మనుగడ వుండదు. ఎంతో ఆలోచించి తీసుకున్న నిర్ణయం నాది. ఇంత కాలం నీతో కలిసి వున్నందుకు దయచేసి నన్ను అర్థం చేసుకో. ముందు మన మధ్య కలహాలు రాకూడదు. అసంతృప్తితో ఇక నీతో నేను జీవించలేను” ప్రశాంతంగానే చెప్పింది అభినయ.

ఆలోచనల్లో పడ్డాడు వినయ్.

అభినయదీ అదే ఆలోచన.

“వినయ్ బాగున్నాడు, సాఫ్ట్‌వేర్ జాబ్ వుంది. తను సుఖపడుతుంది..”

ఇది తల్లిదండ్రుల ఆలోచన. ఆ ఆలోచనను తను బలపరచక తప్పలేదు. నిజమే.. మనుషులను చూస్తాంగానీ మనస్తత్వాలను చూడం కదా. అందంగా.. ఎర్రగా, బుర్రగా వుంటే సరిపోదు. అతని ఆలోచనా విధానం ఎటువంటిదో కలిసి జీవించేప్పుడు కానీ తెలియదు. అప్పటికే టూ లేట్. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అంటే ఇదే.

ప్రతిదానికీ పెడర్థాలు తీస్తాడు. నవ్వితే తప్పు. టీవీలో సీరియల్స్ చూస్తుంటే విసుగు. సెల్‌ఫోన్‌లో సోషల్ మీడియాలో ఫాలో అయితే హు... ఏమిటి ఇతని ధోరణి! పెళ్లిచూపుల్లో నవ్వకపోయినా, పెళ్లిలో అంత హుషారుగా లేకపోయినా మొహమాటమో, సిగ్గో అనుకుంది.

అతని మనస్తత్వం తీరే విచిత్రం, విపరీతం అని రుజువు కావటానికి ఎన్నో రోజులు పట్టలేదు. ప్రతిదానికీ లెక్కలు వేస్తాడు. చివరకు తినే తిండి కూడా. తను తినేటప్పుడు తన ప్లేట్ వైపు చూస్తాడు. ఎప్పుడైనా అమ్మా నాన్నలు వస్తే ముభావంగా వుంటాడు. అతని తీరు చూసి వాళ్లు రావటమే మానేసారు. తనెప్పుడయినా పుట్టింటికి వెళ్తానంటే అడగగా, అడగగా అంగీకరిస్తాడు. బస్సు ఛార్జీ ఎక్కువని, రైల్లో వెళ్లమంటాడు. అవేమో పరిమితంగా వుంటాయి. హాయిగా ఏ లగ్జరీ బస్సులోనో ప్రయాణించాలనేది తన కోరిక.

తనకు ఎవరయినా ఓల్డ్ ఫ్రెండ్ ఫోన్ చేస్తే గుచ్చి గుచ్చి అడుగుతాడు. ఒకటే శంక.. ఏవిటీ చాదస్తం అనిపిస్తోంది. ఒక పెక్యులర్ మెంటాలిటీ. ఒక్కడే కొడుకు మామగారికి. ఎంతో సంపద. తనూ బోలెడు కట్నం తెచ్చింది. అయినా లోభితనం. ఒక మంచి లొకాలిటీలో, మంచి ఫ్లాట్ కొనిచ్చారు మామగారు.

“మనకు తగినంత ఆస్తి వుంది. నీకూ మంచి జాబ్ వుంది. కావాలంటే నేనూ పంపుతాను. ఇద్దరూ హాయిగా వుండండి,. వీకెండ్‌లో ఎంజాయ్ చేయండి” అని కొడుకుకు ఎంతో హితబోధ చేశారు తండ్రి.



ఉహూ.. టైల్స్ తుడవటానికి ఒక మనిషిని పెట్టుకుందామంటే లెక్కలు వేసి “నువ్వు ఖాళీయే కదా.. నీకు మనిషి అవసరమా?” రుసరుసలాడుతూ చెప్పిన అతడికి ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు.

తనకు వీకెండ్‌లో సరదాగా ఎటైనా వెళ్లాలని కోరిక. మరీ దూరం కాకపోయినా సిటీలోనే బోలెడు కాలక్షేపం. ఆ రెండు రోజులూ కదలడు, మెదలడు. ఆ డొక్కు మోటారు బైకు మీదనే ఆఫీసుకు వెళతాడు. కారు కొనే స్థోమత వుంది. కానీ, కొనడు. డౌన్‌లో బైక్ ఆన్‌లో లేకుండా నడిపిస్తాడు, పెట్రోలు ఆదా కోసం.

ప్రతి విషయంలోనూ ప్రతికూల ఆలోచనలే. “మనకు ఆడపిల్ల పుడుతుందేమో! పుడితే ఎన్నో ఖర్చులుంటాయి కదూ” ఒకరోజు అన్నాడు వినయ్.

నెత్తి పట్టుకుంది అభినయ.

"గుడికి వెళ్దామంటే"

"ఎందుకు అంత శ్రమ? ఇంట్లోనే సుబ్బరంగా పూజలు చేసుకోక" అంటాడు.

"ఖర్మరా బాబూ.. తను ఎన్నెన్ని కలలు కన్నది. తన తల్లిదండ్రులు ఎన్నెన్ని కలలు కన్నారని.. ! ఆచి తూచి వినయ్ ఆర్థిక స్థితిగతులను అంచనా వేసి మరీ…

"నేను ఏదయినా పార్ట్ టైం జాబ్ చూసుకుంటాను. ఇంట్లో బోర్ కొడుతోంది" అడిగింది ఒకరోజు.

"జాబా! ఆడవాళ్లు బయటకు వెళ్లటం నాకు ఇష్టం వుండదు. అలా అయితే నేను సాఫ్ట్‌వేర్‌నే చేసుకునేవాడిని" బుద్ధి బయట పెట్టాడు.

"అవునులే… ఈ వింత జీవితో కాపురం చేయలేక పెళ్లాం ఎవడితోనయినా లేచిపోతుందేమోనని అనుమానం కాబోలు. అన్నీ అనుమానాలే. ఆఫీసుకు వెళ్లాక రోజుకు నాలుగయిదు సార్లు వీడియోకాల్ చేస్తాడు, తను ఇంట్లోనే వున్నానా.. లేదా.. అని.

బాప్‌రే! ఈ మనిషితో ఇంకా చాలా కాలం బతకాలి. ఇక తన వల్ల కావటం లేదు. ఇతనిది సైకోబుద్ధి, శాడిజం ఆలోచనలకు మించిన ప్రవృత్తి అనిపించింది అభినయకు.

ఒకరోజు… వినయ్ ఆఫీసుకు వెళ్లిన సమయంలో అమ్మకు ఫోన్ చేసింది అభినయ. అతని ప్రవర్తనా, తన బాధా చెప్పుకుంది.

"సర్దుకుపో తల్లీ. ఏ అఘాయిత్యమూ చేయకు" అంది తల్లి.

రోజూ వింటూ వుంది… ఆమె ఏవేవో వార్తలు. ఆమెకూ బాధగానే వుంది. కూతురి జీవితంలో ఏ రుచీ, పచీ లేదని తెలిసినాక.

తన నిర్ణయాన్ని వినయ్‌కు తెలిపే ముందు సలహా అడిగింది అభినయ, తల్లిదండ్రులను.

"ఆ పని చేయకమ్మా! పెళ్లీడుకొచ్చిన చెల్లెలు వుంది. దానికి పెళ్లి కావటం కష్టం" తేల్చి చెప్పారు వారు.

అంటే– "నీ చావు నువ్వు చావు. మాకేం సంబంధం లేదు. మా ఇంటికి మాత్రం రాకు" అని చెప్పకనే చెప్పారు ఇన్‌డైరెక్టుగా.

అయినా 'ఎద్దెమంటే తెద్దెం' అనే మొగుడితో శాశ్వతంగా జీవించటం ఇక అసంభవం. ఇక తన వల్ల కాదు. అని నిశ్చయించుకున్నాకే తను ఈ నిర్ణయం తీసుకుంది.

అయితే తను ఎక్కడకు వెళ్లాలి. ఇక ఎలా… ఎలా? ఆ ఊహనే అభినయకు అంతుచిక్కడం లేదు. అయినాసరే ఇక రాజీ పడదలచుకోలేదు. అంతే..!

………………

బయటకు వచ్చాక ఒక లేడీస్ హాస్టల్‌లో జాయినయింది అభినయ. తన చేతికి వున్న రెండు గాజులనూ అమ్మివేసింది చేతిలో కొంత పైకం వుండాలని.

అభినయకు హాస్టల్‌లో ఒక అమ్మాయి పరిచయమైంది. పేరు కుసుమ. తన గురించి చెపితే గుండె మీద చేయి వేసుకుని నిట్టూర్చింది.

"బాప్‌రే…ఇటువంటి వ్యక్తులు కూడా వుంటారా? మంచి పని చేశావు అభినయా! అటువంటి వారిని మార్చటం అసాధ్యం. అన్నీ వుండి అతను అలా ప్రవర్తించటం ప్చ్…. గతం ఒక పీడకలలా మరచిపో" ధైర్యం నూరిపోసింది కుసుమ.

ఇక తన గురించి చెప్పింది కుసుమ. తను వివాహానికి వ్యతిరేకి. ఒకతనితో సహజీవనం చేసింది. సమాజం, తల్లిదండ్రులు వెలివేశారు అనేదానికంటే తనే వెలివేసిందని చెప్పాలి.

"నేను ఏదయినా పార్ట్ టైం జాబ్ చూసుకుంటాను. ఇంట్లో బోర్ కొడుతోంది" అడిగింది ఒకరోజు.

"జాబా! ఆడవాళ్లు బయటకు వెళ్లటం నాకు ఇష్టం వుండదు. అలా అయితే నేను సాఫ్ట్‌వేర్‌నే చేసుకునేవాడిని" బుద్ధి బయట పెట్టాడు.

కొద్దికాలం తర్వాత కొన్ని అభిప్రాయ భేదాలు… విడిగా వుందామని నిశ్చయించుకున్నారు.

ఒక ప్రైవేటు సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోంది కుసుమ. చాలా డేరింగ్ మనస్తత్వం వున్న యువతిలా కన్పించింది కుసుమ.. అభినయ కళ్లకు.

రెండు రోజుల తర్వాత అడిగింది కుసుమ, అభినయను "మరి… ఎంత కాలం ఇలా? ఏం చేద్దామనుకుంటున్నావు?" అని

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. నాకు ఓ సాధారణ డిగ్రీ మాత్రమే వుంది. వస్త్ర ప్రపంచంలో తప్ప నాకు ఎక్కడా చోటు దొరకనట్టే వుంది" నవ్వుతూ చెప్పింది అభినయ.

"మరి… మీ వారి నుంచి మనోవర్తి!"

"ఛ… నాకు అటువంటి ఆలోచన, ఆశలు లేవు. అసలే లుబ్ధుడు. ప్రతిదానికీ లెక్కలు వేస్తాడు. నేను కోర్టుకు వెళ్తే గుండె అతను ఆగి చస్తాడు" కన్ను గీటుతూ చిలిపిగా చెప్పింది అభినయ.

ఇప్పుడు ఆమెకు ఎంతో స్వేచ్ఛగా ఉంది.

"మరి… ఇంకా నీ హాబీస్?"

"నా బొంద… వంటలు చేయటం తప్ప నాకు ఇంకేమీ రావు"

"ఆ…!"

"నిజం..!"

"అయితే… హోటల్ పెట్టమంటావా?" ఛలోక్తిగా అంది అభినయ.

"నో… అటువంటిదే.." చిటికె వేసింది కుసుమ.

"ఏమిటి?!"

"నువ్వు చేసే వంటలను యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేద్దాం. యాప్ క్రియేట్ చేసి…" చెప్పుకుపోతోంది కుసుమ.

"ఏమిటి కుసుమా? ఇది జరిగే పనేనా?"

"ఏం…. నువ్వెందులో తక్కువ? నా కంప్యూటర్ పరిజ్ఞానం ఉపయోగిస్తాను. అసలు నీ వంటి నేస్తం కోసమే నేను చాలా రోజులుగా ఎదురు చూస్తున్నాను. మనమిద్దరమూ కలిస్తే.."

ఆలోచిస్తోంది అభినయ.

"నిజమే… ఒకే అడుగు. ఒక్క అడుగుతోనే ఏదయినా సాధ్యం"

"సరే కుసుమా. నువ్వు తోడుంటానంటే నేను ఒక్క అడుగు ముందుకు వేస్తాను. మనం సక్సెస్ సాధించాలి. ఎందరో మహిళామణుల విజయ గాథలు విని వుందామె. వారి గురించి తెలుసుకుని వుందామె.

"సరే అభినయా. అయితే మనం ఓ డబుల్ బెడ్ రూం ఫ్లాట్ తీసుకోవాలి. సరంజామా సమకూర్చుకోవాలి. నా వద్ద కొంత డబ్బు వుంది. ఒంటరి మహిళలం. మనం ఈ సమాజానికి ఒక దిక్సూచిలా నిలవాలి. నిలిచి గెలవాలి... కుసుమలో ఎంతో కాన్ఫిడెన్స్.

అభినయలోనూ ఎంతో ఆత్మవిశ్వాసం.

"ఇంతకంటే పోయేదేం వుంది.." అనుకుంది ఆమె.

"కొంత కాలం చూద్దాం. అప్పటికీ ఫలితం దొరక్కపోతే అప్పుడు ఆలోచిద్దాం" స్థిరంగా నిశ్చయించుకుంది అభినయ.

............

వంట చేసుకునేది వారిద్దరికే అయినా రకరకాల రుచులు... వెజ్, నాన్ వెజ్ ఐటమ్స్ తను చేస్తూ వివరిస్తోంటే మొబైల్‌తో షూట్ చేయసాగింది కుసుమ. ఆ తరువాత తన కంప్యూటర్ ద్వారా ఎడిట్ చేయటం, వాయిస్ చెక్ చేయటం, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయటం కుసుమ పని. 'అభినయ ఫుడ్స్' అని పేరు పెట్టింది చానల్‌కు.

వారానికి కనీసం మూడు వీడియోలు. ముందు మందకొడిగా సాగింది.

ఆ తర్వాత కొద్ది కొద్దిగా సబ్‌స్క్రిప్షన్స్ పుంజుకున్నాయి.... మంచి రేటింగ్. ఆదాయం కూడా రాసాగింది.

కుసుమ 'టేస్టీ' పేరిట ఒక యాప్ క్రియేట్ చేసింది. ఆన్‌లైన్ ద్వారా ఫుడ్స్, స్నాక్స్ పంపాలని ఆలోచన. సిటీలో ఎక్కడెక్కడ ఫంక్షన్స్ జరుగుతున్నాయో కూపీ లాగసాగారు. ఒక కారు కొనుక్కున్నారు.

ఫంక్షన్స్‌కు సకాలంలో ఆర్డర్స్ అందించటానికి కొద్ది మంది వర్కర్స్‌ను కూడా నియమించుకున్నారు. నగరంలో ఒకే ప్రాంతంలో విశాలంగా వున్న ఒక షాపు తీసుకున్నారు. కొద్దికొద్దిగా వస్తున్న ఆర్డర్స్ కాలక్రమేణా పుంజుకున్నాయి.

తను.. తన మాజీ భర్తకు ఎంతో శుచిగా, రుచిగా వండిపెట్టినా రాని గుర్తింపు ఈరోజు వస్తోంది. పైగా ఆదాయం పెరుగుతోంది.

'ఒంటరి' మహిళలు జంటగా క్రమంగా విజయాలు సాధించసాగారు.

నాణ్యతకు అతి ప్రాధాన్యం ఇవ్వసాగారు. పేకేజింగ్ ఎంతో అందంగా, చాలా పకడ్బందీగా చేయించసాగారు.

స్టాఫ్ సంఖ్య వందకు చేరుకుంది. ఎక్స్‌పోర్ట్ కూడా చేయసాగారు.

యూట్యూబ్‌లో అభినయ ఫుడ్స్ బహు ప్రాచుర్యం పొందింది. ఎంతో అనుభవం గడించిన అభినయ తన అందచందాలతో, మాట విరుపులతో వీక్షకులను అలరిస్తోంది. అత్యధిక మహిళామణులు ఎక్కువగా ఫాలో అయ్యే వంట చానల్స్‌లో 'అభినయ ఫుడ్స్' ఒకటిగా పేరు గాంచింది.

ఇటు పికిల్స్, స్నాక్ ఐటెమ్స్, ఫంక్షన్స్ ఆర్డర్లు; ఇప్పుడు అభినయ ఆలోచనలతో ఐటెమ్స్ తయారీ జరుగుతోంది.

రుచి వుంటేనే ఆ వంట జన బాహుళ్యంలోకి వెళ్లేది. సంస్థకు చెడ్డ పేరు రాకూడదు. ఆ విధంగా బిజినెస్‌ను తారాస్థాయిలో నిలిపారు కుసుమ, అభినయలు.

ఏ విషయంలోనూ రాజీ పడకుండా సకాలంలో సమయస్ఫూర్తితో తీసుకున్న నిర్ణయం ఈరోజు వారిని విజయవంతమైన మహిళలుగా సమాజం గుర్తిస్తోంది. కొన్ని కుటుంబాలకు ఆసరా లభిస్తోంది.

............

మహిళా దినోత్సవం రోజున ఒక ప్రముఖ టీవీ చానల్ ఇంటర్వ్యూ చేయటానికి అభినయను అపాయింట్‌మెంట్ అడిగింది.

"చెప్పండి... ఈ ఆలోచన ఎందుకు వచ్చింది? మీ ఫుడ్స్ ఇంత ప్రాచుర్యం పందటానికి కారణాలేమిటి? మీ విజయం వెనుక ఎవరున్నారు?" అడిగింది యాంకర్.

మోమున విరబూసిన చిరునవ్వుతో చెప్పింది అభినయ....

"నాకు తోడు నీడగా నిలిచిన నా ప్రియ నేస్తం కుసుమ, నేను ఇలా ముందడుగు వేయటానికి ప్రధాన కారణమయినా నా విజయం వెనుక నా మాజీ భర్త వినయ్ వున్నాడు".

"మాజీ భర్తనా! అదేమిటి?" అయోమయంగా అడిగింది యాంకర్.

"ఎస్... మీరు విన్నది నిజమే. నా మాజీ భర్తనే. అతని పేరు వినయ్. పేరుకు సాఫ్ట్‌వేర్. ఎన్నో ఆసిపాస్తులున్నాయి. అయినా అనుభవించే యోగ్యత లేనివాడు. చివరకు కట్టుకున్నదానిని కూడా గౌరవించలేనివాడు. ప్రతిదానికీ ఆంక్షలే. అతనిదొక విచిత్ర మనస్తత్వం.

ఇక అతనితో కలిసి బతకటం దుర్లభం అని తెగించి అతి సాహసంతో బయటకు వచ్చాను, తెగతెంపులు చేసుకుని మరీను.

"నాకు తోడు నీడగా నిలిచిన నా ప్రియ నేస్తం కుసుమ, నేను ఇలా ముందడుగు వేయటానికి ప్రధాన కారణమయినా నా విజయం వెనుక నా మాజీ భర్త వినయ్ వున్నాడు". "మాజీ భర్తనా! అదేమిటి?" అయోమయంగా అడిగింది యాంకర్.

కుసుమ సాహచర్యం లభించింది. అంతగా ఉపయోగపడని డిగ్రీ.... ఆ సమయంలో కుసుమ సలహాతో నేను ముందడుగు వేయగలిగాను. కొద్దిపాటి మూలధనంతో సరదాగా మొదలయిన నా వ్యాపకం ఇంతగా విస్తరించటానికి కారణం ఒక విధమయిన మొండి ధైర్యం... ఇది మినహా బతుకు లేదనే తెగింపు.

రాజీ పడి అతనితో బతికితే ఆత్మను చంపుకుంటూ రోజూ నరకం అనుభవిస్తూ, మానసిక చిత్రవధ పాలవుతూ ఓ... మైగాడ్.. వంటింటి కుందేలుగా అనామకంగా మిగిలిపోయే దానిని. చెల్లెలు పెళ్లి చేయాలని మొగుడిని విడిచిపెట్టిన కూతురు, తమ ఇంట్లో వుంటే తమకు పరువు తక్కువని నన్ను ఆదరించని నా కన్నవారు....

వీరందరికీ కృతజ్ఞతలు చెప్పాలి. నేనేమిటో నా ప్రతిభ ఏమిటో నా తెగింపు ఏమిటో తెలియాలి. అందరికీ తెలియాలి.." అభినయ మాటలో ఎక్కడా పశ్చాత్తాపం లేదు.

చివరిగా మాట్లాడుతూ "రిస్క్ ఎదురయినప్పుడు భయపడకూడదని, జీవితంలో రాజీ పడకూడదని, లైఫ్‌లో డేరింగ్ డెసిషన్స్ తీసుకోవాలని. ఇటువంటి విజయవంతమయిన ముగింపుల గాథలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాను. నా పరిస్థితులే నన్ను ముందుకు నెట్టాయి..." ముగించింది అభినయ.

# జనంలోకి తెలుగుమాట

జయసూర్య

**తెలుగుదనం చిలికే మాటలు ఉన్నా, వాటికి బదులు ఆంగ్ల పదాలు అలవాటుగా వాడటం కారణంగా మనం తెలుగు భాషకు తీరని అన్యాయం చేస్తున్నాం. నాగరికత, జీవన విధానాలు ఆధునికత, నవ్యత కారణంగా అన్నింటికీ తెలుగులో వాడుకకు వినియోగించుకొనే, సమానార్థకాలు లేని మాట నిజమే.**

కొన్ని మాటలు మనం దత్తత తీసుకొన్నట్టుగా భాషలో కలుపుకోక తప్పదు. దైనందిన వ్యవహారాల్లో మాతృభాష ఎంతవరకు సామాన్యులు వినియోగించుకోగలుగుతున్నారో అనే విషయంపై భాష మనుగడ, ఆధారపడి వుంటుంది. తల్లి ఉగ్గుపాలతో ఆంగ్లం నేర్పిస్తే, తెలుగు మాటలు నేర్పడానికి బదులు ఆంగ్ల పదాలు ముద్దు ముద్దుగా వల్లె వేయిస్తే తెలుగు కనుమరుగవక తప్పదు. డాడీ, మమ్మీ సంస్కృతి శృతి మించితే తెలుగు పతనం కాక తప్పదు. తెలుగు కనుమరుగు కాకుండా రక్షించుకోవాలనే తపన కొద్ది మందికే ఉంది. చాలా మంది విద్యాధికులైన తల్లిదండ్రులకు అసలు ఆ పట్టింపు లేదు.

ఒకప్పటి పాలకులకు, భాషాభిమానం లేదనడం సరి కాదు. మన కవులకు మన భాషపై అభిమానం లేదనుకోవడం అంతటి దోషమే. అయితే వారు పట్టించుకోకపోవడం వలన మన భాష వ్యవహారంలోకి రాలేదనే మాట చారిత్రక వాస్తవం.

క్రీ.పూ. 5వ శతాబ్దం నుంచి క్రీ.శ. 1వ శతాబ్దం వరకు మన మాటలు ఎలా ఉన్నాయో తెలియదు. భారతంలో ఆంధ్రభాష అని వాడటం సుస్పష్టమైన విషయం. ఇది క్రీ.శ. 11వ శతాబ్దంనాటి మాట. ఎంత కాదనుకొన్నా క్రీస్తు శకారంభం నుండి మన జాతికి మన దేశానికి, మన ఈ భాష స్థిరపడి ఉండి తీరాలి. అమరావతి స్థూపంపై 'నాగబు' అనే మాట మొట్టమొదటిగా నిర్ధారించుకొన్నాం. క్రీ.పూ.200 నుండి క్రీ.శ.200 మధ్య కాలంనాటి ఆ మాట 'చెంబు' అనే పదం లాంటిది. నాటి గ్రాంథిక భాష సంస్కృతం, వ్యావహారిక భాష ప్రాకృతంలో రెండూ రాజభాషలయినా తెలుగు మాటలు కలిగి వున్నాయి.

తెలుగు పదజాలం కేవలం గ్రామాల పేర్లు, వ్యక్తుల పేర్లకు మాత్రమే పరిమితమైపోయింది. హిందీ భాషా ప్రభావం విపరీతంగా మన పేర్లు పెట్టడంలో కనిపిస్తుంది.

**"నట్టనడి సంద్రాన
నావ నిలుచుండాది
చుక్కాని బట్టరా తెలుగోడా"** అన్నారు వి.యస్.కృష్ణ. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగు మాతృభాషగా నావ దరి చేరింది. భాష పేరిట




పాలనాధికారం హస్తగతమైంది. ఇక మాట మాటేమిటి?

ఒకప్పుడు వ్యవహారిక భాషగా తెలుగు వెలుగులు ప్రసరింపచేసిన పత్రికలు, చలనచిత్ర రంగం ప్రస్తుత స్థితిగతులలో విపరీత పరిణామాలు చెందుతున్నాయి. చదవడం తగ్గిపోవడంతో, ప్రకటనల మీద ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి. ఇక చలనచిత్ర రంగంలో జాతీయ, అంతర్జాతీయ నీడలు పడుతున్నాయి. తెలుగు మాటలు తెలియక చలనచిత్ర నిర్మాతలు, దర్శకులు అవక తవకల శీర్షికలు పెడుతున్నారు.

ఇక రాతలో తప్పులు కోకొల్లలు. అసలే క్లిష్టమైన భాష. ర, ఱ, ఋ, న, ణ వంటి అక్షరాలు ఎక్కడ ఏది వాడాలో వాడకూడదో చెప్పేవారు లేరు. తొడపాశాలు పెట్టి అక్షరాలు నేర్పే పంతుళ్ల ఆనాటివారు.

కాలంతో పాటు జీవన విధానాలు మారుతున్నట్టే భాష కూడా మారక తప్పదు. సంస్కృత పద సంకలితం కానక్కర్లేదు. గ్రాంథికం జోలికి మనం పోనక్కర్లేదు. పండిత భాషను గౌరవిద్దాం. పల్లెలు, పట్టణాలు, నగరాలుగా రూపాంతరం చెందుతున్న ప్రస్తుతంలో కృత్రిమ అన్య భాషా పద వినియోగానికి బదులుగా వున్న పలుకుబడిని పదిలపరుచుకొనే ప్రయత్నాలు కావాలి.

తెలుగుకు రెండు రాష్ట్రాలలో అద్భుతమైన మాండలీక సంపద వుంది. తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర, మధ్యాంధ్ర ప్రాంతాలలోని తెలుగు పలుకుబడి నిర్జీవం కాకుండా రచయితలు ఎంతో ప్రశంసనీయమైన సాహితీ సేవ అందించారు.

గీర్వాణం అన్న మాటకు బదులుగా క్రమేపీ సంస్కృతం అన్న పేరు సంస్కరించడం వల్లనే వచ్చింది. సం॥ అంటే చక్కగా కృత॥ సంస్కరింపబడినదని అర్థం. ఆ సంస్కరణ తర్వాత వాడుకలో వున్న భాష ప్రాకృతమైంది. ప్రాకృతం పాత్రలనుబట్టి నాటక రచన, ప్రహసనాలలో కూడా నాడు వినియోగించబడింది. ఆ విధంగానే క్రమేపీ ఆంధ్రభాష తెలుగుగా నవ్యత పొందింది. అయినా దైనందిన వ్యవహారాల్లో ఆధునిక జీవన విధానాలలో తెలుగు వినియోగం కృతకంగా అనిపించని పదజాలం కలిసి, అర్థం చేసుకోవడానికి, ఎన్నో కొత్త మాటలతో భాష సంపన్నవంతమైంది. ఇతర భాషా పదాలను తనలో ఇముడ్చుకోగలిగిన సౌలభ్యం వున్న తెలుగులో మాట్లాడటం ఇంటా బయటా అనర్గళంగా కొనసాగించాలి.

సరళమైన, సులభ గ్రాహ్యమైన తెలుగు మాటలు మరింతగా జనం వినియోగించే రీతిలో ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా శ్రద్ధ వహించాలి. వివిధ మాండలిక ప్రాంతాలలోని పదాలను ఏర్చి కూర్చి అన్ని సాహితీ ప్రక్రియలలో ప్రాచుర్యం కల్పించాలి. ప్రభుత్వ పరంగా సామాన్య ప్రజానీకానికి ప్రయోజనకరంగా ఉండే అభ్యర్థన వివరణ పత్రాలు దరఖాస్తులు తప్పనిసరిగా మాతృభాషలో వుండాలి. ముఖ్యంగా ప్రాథమిక, మాధ్యమిక స్థాయి బాల బాలికలకు తెలుగుతో సాన్నిహిత్యం వుండే విధంగా విద్యా విధానం తప్పనిసరిగా రూపొందింపచేయాలి. "తెలుగదేలయన్న దేశంబు తెలుగేను..." అంటూ తల్లి భాషను సదా ఆరాధించాలి.

# ఎక్కడికెళ్లాలి?

**యామిజాల జగదీశ్**

**ఎప్పుడు చూసినా “ఆ దేశంలో ఇలా ఉంది. ఈ దేశంలో అలా ఉంది అని చెప్తుంటాం తప్ప మన దేశంలో ఎలా ఉండేది... ఇప్పుడెలా ఉంది” అని చెప్పరు సార్!” అన్నాడొకడు.**

**ఆయన అలా చెప్పడమూ సబబే. కాదనలేం. ఎప్పుడూ కాకపోయినా అప్పుడప్పుడైనా మన దేశం గొప్పల గురించి మాట్లాడుతుండాలి సార్!” అని ఆయన అభిప్రాయం.**

మన గత కాలపు గొప్పలు మనకు బాగానే తెలుసు. తెలియక కాదు. అయినప్పటికీ అప్పటి గొప్పల గురించి తరచి చూసుకోవసిన అవసరం ఉంది.

మను నీతి చోళుడి కథ పలువురికి తెలిసిందే కావచ్చు. అలాగే మధ్యప్రదేశంలోనూ ఒక మనునీతి చోళుడు ఉండేవాడు. ఆయన ఓ మహారాజు. పేరు వీరసింగ్ దేవ్. ఒడిశా రాజు. ఆయన కుమారుడు ప్రవీరాయ్... యువరాజు.

తండ్రికి తగ్గ తనయుడు అని చెప్తూ ఉంటాం కదా.

కానీ ఈ కొడుకు అదేనండీ... యువరాజు అలా కాదు. ఒకింత భిన్నమైనవాడు.

ఆ యువరాజు ఏం చేసాడంటే ఒకరోజు అడవికి వెళ్లాడు వేటాడటానికి. అలా వెళ్లిన చోట ఓ సాధువుని చంపేశాడు. ఇది తెలియడంతోనే అతనిని బంధించమని రాజు ఉత్తర్వులు జారీ చేశాడు.

యువరాజుని బంధించి రాజుగారి ముందుకు తీసుకువచ్చి నిలబెట్టారు. రాజు అతనిని చూశాడు. అతనెవరో కాదు కదా, స్వయంగా తన కొడుకైన యువరాజు.

“ఆ సాధువును చంపింది నువ్వేనా?” అని అడిగాడు రాజు.

అయితే యువరాజు ఒకింత పొగరుగా జవాబిచ్చాడు.. “నేను అతనిని చంపలేదు, నా వేటకు అతను అడ్డుగా ఉన్నాడు. అందుకు అతనికి శిక్ష విధించానంతే” అన్నాడు యువరాజు.

సభలో ఉన్నవారందరూ యువరాజుని కాపాడుకోవడానికి ఏవేవో చెప్పి చూశారు.

“రాజా, యువరాజుకి కఠిన శిక్ష విధించకండి.. ఎందుకంటే మీ తదనంతరం ఈ దేశానికి అతనే రాజు కావాల్సి ఉంది” అని చెప్పారు.

అయితే రాజు “జనానికి ఓ ఆణిముత్యంలా ఉండిన సాధువును ఇతను



హతమార్చి ఇక్కడ మన ముందు ఓ నేరస్తుడిగా ఉన్నాడు. పైగా తన చర్యను సమర్థించుకుంటున్నాడు. నిర్లక్ష్యంగా జవాబిస్తున్న అతని మాటలు వినలేకపోతున్నాను. అహంకారంతో విర్రవీగుతున్న ఇతన్ని వారసుడు అని అనుకోవడానికి నా మనసు ఒప్పుకోవడం లేదన్నాడు” రాజు.

“అంతేకాదు, తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించక తప్పదు.. ప్రజలందరికీ ఓ చట్టం. రాజవంశీకులకు ఒక చట్టం తగదు. చట్టం ముందు అందరూ సమానమే” అన్నాడు రాజు.

ఈ విధంగా నీతి, ధర్మం, న్యాయం అక్కడ ఉండటం వల్ల ఆ రాజ్యం ఎప్పుడూ చక్కగా.. సుభిక్షంగా ఉండేది. నలుగురూ గొప్పగా చెప్పుకునేవారు. ప్రజల మధ్య ఉన్న ఐకమత్యం వల్ల ఇరుగు-పొరుగు దేశాలేవీ ఈ రాజ్యంపై దండెత్తలేదు. అసలు దాడి చేయడానికి ఎవరూ ముందుకు రాలేదన్నదే నిజం.

గత చరిత్ర ఎంత ఘనమైందో విన్నారుగా!

సరే...! అదలా ఉండనిచ్చి నాకు తెలిసిన ఓ రాజు గురించి చెప్తాను.

అతను ఈ పై రాజుకి భిన్నమైనవాడు. ఓ ఊళ్లో ఓ నియంత ఉన్నాడు.

ఒకరోజు ఆ దేశపు జైళ్ల శాఖ అధికారి రాజు వద్దకు వచ్చాడు.

“ఏమిటి విషయం?” అని అడిగాడు రాజు.

“మన జైల్లో ఉంటున్న ఖైదీలందరూ తమ తమ గదుల్లో కలర్ టీవీలు పెట్టవలసిందిగా ఆందోళన చేస్తున్నారు” అన్నాడు జైలు అధికారి.

“దానికేం? ఖైదీలు కోరినట్టే వారి వారి గదుల్లో టీవీలు ఏర్పాటు చేయండి.... తప్పేముంది?” అన్నాడు రాజు.

కొన్ని రోజుల తర్వాత జైలు అధికారి మళ్లీ వచ్చాడు. నియంత రాజుని చూశాడు.

“ఇప్పుడు మన ఖైదీలందరూ వారానికి ఒకరోజు సెలవు ఇవ్వాలని ఆందోళన చేస్తున్నారు” అన్నాడు జైళ్ల అధికారి.

అప్పుడు అక్కడే ఉన్న సైన్యాధిపతి లేచి నిల్చుని రాజు గారితో “రాజా, మనం సౌకర్యాలు కల్పించాల్సింది స్కూళ్లకు తప్పించి జైళ్లకు కాదండి” అని.

సైన్యాధిపతి మాటలను విన్న రాజు మాట్లాడుతూ “అది సరే, మనమందరం పదవి నుంచి తప్పుకున్నాక స్కూళ్లకు వెళ్లాలన్నదే నీ ఉద్దేశమా?” అని అన్నాడు.

దాంతో రాజు తాను వెళ్లే చోటు ఏమిటో ఇప్పుడే అర్థం చేసుకున్నాడన్నమాట.

# సింగిల్ పేజీ కథ

# వ్రతం

ఓట్ర ప్రకాశ్‌రావు

ఐటీ ఉద్యోగంలో చేరాక ఎప్పుడెప్పుడు శని, ఆదివారాలు వస్తాయా... ఆ రెండు రోజులు హాయిగా నిదుర పోదామా.. అని అనుకొంటూ వుంటాను. విదేశీ సమయం అంటూ సాయంత్రం కంప్యూటర్ ముందు కూర్చుంటే సూరీడు రావడానికి ముందు కంప్యూటర్ ఆఫ్ చేసి పడుకొనే జీవితమయ్యింది.

శని, ఆదివారాలు నా జీవితానికి కాస్త విశ్రాంతి కలిగిస్తాయి. శనివారం ఐదు గంటలకు కంప్యూటర్ ఆఫ్ చేసి మంచంపై పడుకోవడానికి వెళ్తుంటే "ఏమండీ ఈరోజు అక్కయ్య ఇంటికి వెళ్లాలి, వ్రతం చేస్తోంది" సంతోషంగా అంది.

"అదేమిటే! నాకు దొరికే ఆ రెండు రోజులు హాయిగా పడుకొంటాననీ నీకు తెలుసుగా, శుక్రవారం వ్రతం అంటే పరవాలేదు. ఇప్పుడేమి శనివారం వ్రతం.." అడిగాను.

"నేనూ అదే మాట అడిగాను. నిన్న సాయంత్రం జరిగిన సంఘటన మీ అక్కయ్య మనసును గాయపరిచిందట. మనసులోని భారాన్ని తగ్గించుకోవడానికి ఏరోజు అయితే ఏమంటూ సమాధానమిచ్చింది" అంది.

"ఇంతకూ ఏం జరిగింది?"

అడిగితే "అదంతా ఫోనులో ఎందుకు? నేరుగా చెబుతాను. నీవు మా తమ్ముడితో కలిసి రా.. అంటూ అక్కయ్య ఫోన్ పెట్టేసింది"

"ఈరోజు మధ్యాహ్నం వరకు ద్ర పోలేను. వ్రతం పూర్తి కాగానే భోజనం ముగించుకొని ఇంటికి వచ్చి పడుకోవాలి" అన్నాను నిరుత్సాహంగా.

మా అక్కయ్య సామాన్యంగా వున్నట్లుండి వ్రతం అంటూ చేయదు. వ్రతం అంటే మమ్మల్నే ఎందుకు పిలుస్తుందంటే వ్రతం ముగిశాక దుస్తులు పెడుతుంది. ఎవరికో బయటి వారికి ఇచ్చే బదులు మా ఆవిడకు ఇస్తుంది.

మమ్మల్ని అక్కయ్య, బావగార్లు సాదరంగా ఆహ్వానించారు.

"సాధారణంగా ఆడవారు చేసే పూజలు, వ్రతాలు నోములు చాలా వరకు అయిదోతనం కోసమో, పిల్లల భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలనో చేయటం జరుగుతుంది. వున్నట్లుండి ఈ వ్రతం ఎందుకే అక్కా?"

"రిటైర్మెంటు తీసుకొని ఒక నెల రోజులు కూడా కాలేదు. అప్పుడే వసపిట్టలా మాట్లాడుతున్నారు. ఇక జీవితాంతం ఎలా వేగుతానో? ఈయన నోటికి అదుపు లేకుండా పోతోంది. అనవసర ప్రసంగం వలన ఈ వ్రతం చెయ్యవలసి వచ్చింది" అంది.

"ఇంతకూ ఏం జరిగిందో చెప్పవే" అడిగాను.

"ఎప్పుడూ ఇంటి ముందు కూర్చొని ఎవరైనా కనపడతారా అంటూ చూడటం, పలకరించడం..."

"ఇంతకూ బావ ఎవరితో గొడవ పెట్టుకొన్నారు?"

"పక్కింటిలో వున్న..."

"పక్కింట్లో వున్న లోకేష్ చాలా మంచి మనిషి ఎవరి జోలికి వెళ్లేవారు కాదు. నేనెప్పుడొచ్చినా హాలో సార్! బాగున్నారా? అంటూ మర్యాదపూర్వకంగా పలకరిస్తుంటాడు".

"అతను చాలా మంచి మనిషే.."

"ఆయన భార్య అతనికన్నా చాలా మంచి మనిషి అని నీవే ఒకప్పుడు చెప్పినట్లు గుర్తు" అంది మా ఆవిడ.



"వాళ్లిద్దరూ చాలా మంచివారు. కానీ వాళ్ల అబ్బాయి రెండవ తరగతి చదువుతున్న చైతన్య వల్ల ఈ వ్రతం చెయ్యవలసి వచ్చింది.

"ఏమిటీ? రెండవ తరగతి చదివే ఆ చైతన్య వల్లనా? ఏమిటే... నువ్వు చెప్పేది?" అయోమయంగా అంటూ అక్కయ్యవైపు చూసాను.

"వాడికి మంచి తెలివి ఉంది. ఈ కాలం పిల్లలను ప్రశ్నిస్తే మనం ఊహించని సమాధానం వస్తుందని తెలుసు. నా సెల్ ఫోన్‌లో ఏదైనా చిన్న చిన్న సమస్యలు వస్తే వాడే సరిచేస్తాడు. నేను చేసిన పొరపాటు ఏమిటంటే...

"నువ్వేమని ప్రశ్నించావు బావా?"

"ఏమోయ్! చైతన్యా!! బాగా చదువుతున్నావా? అంటే "చదువుతున్నాను తాతయ్యా" అన్నాడు.

ఆ తరువాత నేను వాడివైపు చూస్తూ "చైతన్యా, నీవు బాగా చదివి డాక్టరు కావాలి" అన్నాను.

ఆ ప్రశ్న నాకేమి వింతగా అనిపించలేదు "డాక్టరు ఔతాను.. అని చెప్పి వుంటాడు" అన్నాను.

"నాకు డాక్టరు కావాలని వుంది తాతయ్యా, తప్పకుండా డాక్టరు అవుతాను అని చెప్పాడు"

"అంతటితో నోరు మూసుకుని వుండొచ్చుగా! ఆ తరువాత అడిగిన అనవసరమైన ప్రశ్న వలన ఈ వ్రతం చేసుకొనేలా చేసాడు"

"మీ అక్కయ్య వ్రతం చేస్తూ ఎటువంటి శ్లోకాలు చదువుతుందోగానీ నా మీద దండకాన్ని బాగా చదివేసింది" బావ బాధగా అన్నాడు.

"బావ అంతగా అడగకూడని ప్రశ్న ఏం వేశారు?"

"చైతన్యా, నీవు డాక్టరు అయ్యాక నాకు ఆపరేషన్ ఉచితంగా చేస్తావా? అని సరదాగా అడగడం మీ అక్కయ్యకు పెద్ద తప్పు అయిపోయింది".

"వాడు ఏమి సమాధానం చెప్పాడో అడుగురా" కోపంగా నా వైపు చూస్తూ అంది అక్కయ్య.

"తాతయ్యా, మీకు ఇప్పటికే చాలా వయసయిపోయింది. నేను డాక్టరు అయ్యేంతవరకు మీరు బతికివుండరు. తప్పకుండా చనిపోయి వుంటారు" అని చెప్పగానే వాడి చాతుర్యానికి గట్టిగా నవ్వాను.

నా వెనుక వున్న మీ అక్కయ్య "ఈ కాలం పిల్లల దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి, పిల్లలు బాగా తెలివి మీరిపోయారు, కీలెరిగి వాత పెట్టగల ఘటికులుగా మారారు" అంది.

"నిజమే సుమా..అక్కయ్య అన్న మాటల్లో ఎంతో వాస్తవముంది" అని మనసులో అనుకొన్నాను. ✦

# ఆకట్టుకునే కట్టడాలు

షేక్ అబ్దుల్ హాకీం జాని



## రామప్ప దేవాలయం

ఓరుగల్లును పరిపాలించిన కాకతీయ రాజులు నిర్మించిన చారిత్రక ఆలయం రామప్ప దేవాలయం. ఇది శివాలయం. 'రామప్ప' అంటే ఈ ఆలయంలో దైవం పేరు కాదు. ఈ ఆలయాన్ని అద్భుత కళాఖండంగా మలచిన ప్రధాన శిల్పి పేరు. శిల్పకళా విశిష్టతతో నిర్మితమైన రామప్ప గుడి తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేటలో నెలకొని ఉంది. వరంగల్లుకు 70 కి.మీ. దూరంలో ఉందీ ఆలయం. అపురూప కట్టడంగా ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామప్ప అణువణువునా ప్రత్యేకతలతో, అద్భుత శిల్ప కళా నైపుణ్యంతో కాకతీయుల ఘనకీర్తిని చాటి చెబుతుంది. రామప్ప ఆలయ గోపురం నిర్మాణానికి ఉపయోగించిన ఇటుకలు నీళ్లల్లో వేస్తే తేలుతాయనేది పరిశీలకుల వాదన. శాండ్ బేస్డ్ టెక్నాలజీతో, భూకంపాలను తట్టుకునేలా, ఇసుక పునాదులపై నీళ్లపై తేలియాడే బరువులేని ఇటుకలతో నిర్మించిన కట్టడం రామప్ప ఆలయం. ఏనుగు పేడ, తవుడు, కరక్కాయ, చెట్ల జిగురుతో ఇటుకల తయారీ చేసినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఒకే రాయిలో మూడు రంగులు కలిగి వుండడం ప్రధానమైన అంశం.

ఈ ఆలయంలో శిల్పకళ విశిష్టతను తెలిపే మరో అద్భుతం సప్తస్వరాలు పలికే శిల్పం. ఆలయ ప్రధాన ద్వారానికి ఎడమ వైపున ఉండే శిల్పాన్ని వేళ్లతో మీటితే సరిగమపదనిసలు పలుకుతుంది.రామప్ప దేవాలయానికి యునెస్కోవారి గుర్తింపు లభించింది. తెలుగు రాష్ట్రాల్లో వారసత్వ గుర్తింపు పొందిన తొలి కట్టడంగా రామప్ప రికార్డు సృష్టించి విశ్వఖ్యాతినార్జించింది.

## ముడుమాల నిలువురాళ్లు

తెలంగాణలోని నారాయణపేట జిల్లా ముడుమాల ప్రత్యేకమైన పురావస్తు ప్రదేశంగా విరాజిల్లుతోంది. ఇది ఒక ప్రాచీన ఖగోళ అద్భుతం. నారాయణపేట జిల్లాలో కృష్ణ మండలంలోని 'ముడుమాల' కృష్ణా నది ఒడ్డున ఉన్న ఒక చిన్న గ్రామం. అక్కడ పొలాల మధ్య ఉన్న నిలువురాళ్లు ఇంగ్లండ్‌లోని 'స్టోన్ హెంజ్'కు ఏమాత్రం తీసిపోవు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఇది కొత్త రాతియుగంలో అంటే ఇప్పటికి సుమారు



మూడు వేల ఏండ్ల కిందటే ఏర్పాటైన అంతరిక్ష పరిశోధన కేంద్రమని తెలుస్తుంది. ఇక్కడ పురాతన, చారిత్రక గుర్తింపు పొందిన నిలువురాళ్లు ఉన్నాయి. వీటిని 'మెన్హిర్స్' అని పిలుస్తారు. మధ్య యుగంలో రాజస్థాన్‌లోని జైపూర్, ఢిల్లీలో కట్టిన జంతర్ మంతర్ వంటిదే ముడుమాలలో ఉన్న 'మెన్హిర్'లు. ఇలాంటి ప్రత్యేక అమరికతో ఉన్న రాళ్లు, మెన్హిర్లు కర్ణాటకలోని నిలస్కల్, విభూతిహళ్లి, హనంసాగర్, హెరొద్రంలలో ఉన్నప్పటికీ ముడుమాల విశిష్టత కలిగిన ప్రత్యేక ప్రదేశంగా పేర్కొనవచ్చు. దక్షిణాసియాలో ఇలాంటి అమరిక ఉన్న అతి పెద్ద ప్రదేశం ఇదే. అధ్యయనంలో భాగంగా దక్కన్ ట్రస్ట్ బృందంతో పాటు ఇప్పటికి అనేకమంది ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ముడుమాలలో ఉన్న నిలువురాళ్లు బృహత్ శిలాయుగపు ప్రదేశాల్లో అతి ముఖ్యమైనదని పరిశీలకుల అభిప్రాయం. ఇక్కడ 10 నుండి 15 అడుగుల ఎత్తయిన 80 నిలువురాళ్లు ఉన్నాయి. ఈ బృహత్ శిలా కట్టడాలు మూడు వేల సంవత్సరాల పూర్వం నిర్మించి ఉంటారని తెలుస్తోంది. నిలువరాళ్లల్లో కొన్నిటిని కచ్చితమైన వరుసలో కూర్చారు. ఈ వరుసలలో కొన్ని ఉత్తరాయనం, మరికొన్ని దక్షిణాయనం, చివరి రోజున సూర్యునికి అభిముఖంగా ఉండడం గమనార్హం. బహుశా ఈ నిలువురాళ్ల వరుసలను ప్రాచీన కాలంలో కాల గణనానికి ఉపయోగించి ఉంటారని చెబుతున్నారు. అమెరికాలోని నార్తర్న్ అరిజోనా వర్సిటీలో జరిగిన ఆర్కియో ఆస్ట్రానమీ సదస్సులో, యూరోపియన్ ఆఫ్ ఆస్ట్రానమీ ఇన్ కల్చర్ ఆధ్వర్యంలో ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో జరిగిన సదస్సులో ముడుమాల ప్రాధాన్యాన్ని పలువురు వివరించారు.

ఇంగ్లండులోని విల్‌షైర్ ప్రాంతంలో ఈ తరహా నిర్మాణం ప్రపంచాన్ని విశేషంగా ఆకర్షిస్తోంది. దానికి స్టోన్ హెంజ్ అని పేరు పెట్టారు. ఇంగ్లండులోని ఆ ప్రదేశానికి యునెస్కోవారు ప్రపంచ వారసత్వ హోదాను కల్పించారు. ముడుమాలకు కూడా అలాంటి ఖ్యాతి దక్కే అవకాశం ఉందని కొందరి అభిప్రాయం.

సౌరగతిని చూపే క్యాలెండరు నిలువురాళ్లు అనేది అక్షర సత్యం. కొన్ని నిలువురాళ్ల వరుసలు జూన్ 20-21 వేసవిలో వచ్చే సౌర అయనాంతం, 21-22 డిసెంబరునాడు వచ్చే కలి కాలపు సౌర అయనాంతంనాడు సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల్లో ఒకే వరుసలో ఉంటాయి. ఆనాటి ప్రజలు ఈ రాళ్లను సునిశితంగా పరిశీలించే ఈ క్రమంలో ఏర్పాటు చేసి ఉంటారు. దీంతో సౌర సంచారం, రుతువుల మార్పుల క్రమాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకుని జీవన క్రమాన్ని క్రమబద్ధం చేసుకున్నారు.

రుతువులపై ఆధారపడ్డ వ్యవసాయానికి ఈ నిలువురాళ్లు ఒక క్యాలెండరులా ఉపయోగపడి ఉంటాయి. ఒకప్పుడు ముడుమాలలో ఇటువంటి ప్రాచీన సంపద చాలా ఉండేది. కొందరు నిధి అన్వేషకులు ప్రభుత్వ సిబ్బంది అని అబద్ధాలు చెప్పి 2006లో ప్రొక్లెయినర్ సాయంతో ఇక్కడి కొన్ని నిర్మాణాలను ధ్వంసం చేశారు. వారికి ఎటువంటి నిధి, నిక్షేపాలు దొరకలేదు. చేసేది లేక నిధి అన్వేషకులు రాత్రికి రాత్రే అక్కడి నుండి ఉడాయించారు. వీరు చేసిన నిర్వాకం వల్ల ప్రపంచంలోనే అరుదైన, చారిత్రక, పురాతన నిర్మాణాలకు కొంతమేర హాని జరిగింది. ఆ తరువాత ఈ ప్రాంతంలోని అసైన్‌మెంట్ భూములను ప్రభుత్వం కొందరు రైతులకు పంచింది. వారిలో కొందరు రైతులు ముడుమాల ప్రాంతంలోని కొన్ని నిలువురాళ్ల నిర్మాణాలను ధ్వంసం చేసి వ్యవసాయం ప్రారంభించారు. ఆ తరువాత ఇక్కడికి వచ్చిన పరిశోధకులు మిగిలివున్న రాళ్లను ధ్వంసం కాకుండా పరిరక్షించారు. నేడు ఈ నిలువురాళ్లు ధ్వంసం కాకుండా అనేక చర్యలను తీసుకుని పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

మొదట ఈ ప్రాంతాన్ని 1956లో ఎఫ్.ఆర్.అల్చిన్ గుర్తించారు. నాలుగు దశాబ్దాల తర్వాత హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ చరిత్ర శాఖ ప్రొఫెసర్ కేపీ రావు ముడుమాలలో చేసిన పరిశోధనలు, ఆయన రాసిన పత్రాల వల్ల దీనికి అంతర్జాతీయ ఖ్యాతి రావడానికి కారణమయ్యాయి. ఆ తర్వాత నుంచి మెగాలితిక్ ఆస్ట్రానమీ అంటే బృహత్ శిలాయుగపు ఖగోళ శాస్త్రానికి ముడుమాల ఒక మ్యూజియంగా మారింది.

## ఎలగందల్ కోట

కరీంనగర్ జిల్లాలోని ఎలగందల్ కోట చాలా ప్రత్యేకమైనది. ఇది కరీంనగర్‌కు 10 కి.మీ. దూరంలో కామారెడ్డి రోడ్డు మార్గంలో మానేరు నదీ తీరంలో నెలకొని ఉంది. పూర్వం ఇక్కడ కందులు బాగా పండించేవారట. అందుకే ఈ ప్రాంతాన్ని తెల్లకందుల అని కాలక్రమేణా ఈ ప్రాంతం ఎలగందల్‌గా మారిందని తెలుస్తుంది. ఎలగందల్ కోటను వెలగందుల అని కూడా పిలుస్తారు. ఎలగందల్‌లో ఓ పురాతనమైన కోట(ఖిల్లా) ఉంది. కొండ మీద వున్న ఈ కోటను ఎలగందల్ కోట అంటారు. ఎత్తయిన కోటగోడలు, బలమైన చెక్కతలుపులు, వంకర టింకర దారులు, రాజదర్బారు కలిగిన మసీదులతో ఈ ఖిల్లా అలరారుతోంది. ఈ గిరి దుర్గాన్ని తొలుత కాకతీయులు కట్టించారు. ఆ తరువాత అనేకమంది నవాబులు దీన్ని పునర్నిర్మాణం చేసి అభివృద్ధి పరచారు. ఎలగందల్ కోటలో నేటి తరానికి తెలియని అనేక రహస్యాలు దాగి ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. టర్కీ, ఫ్రెంచి ఇంజినీర్ల ప్రభావం వల్ల ఈ కోట అనేక విషయాల్లో మధ్యయుగపు ఐరోపా ఖండపు కోటలతో పోలి ఉంది. నిజాం పాలనలో ఈ కోట కరీంనగర్‌కు ప్రధాన కార్యాలయంగా ఉండేది. ఎలగందల్ కోటలో ప్రత్యేకమైన మసీదును కూడా నిర్మించారు. ఈ మసీదుకు చార్మినార్ స్తంభాలను పోలిన రెండు పొడవాటి మీనార్లను నిర్మించారు. ముస్లిం సన్యాసులైన సయ్యద్ షా మునావర్ ఖాద్రి సాహెబ్, దూలా షాహ్ సాహెబ్, సయ్యద్ మరూఫ్ సాహెబ్, షాహ్ తాలిబ్ బిస్మిల్లా సాహెబ్, వలీ హైదర్ సాహెబ్ ఇత్యాది వారి సమాధులు కదిలించినప్పుడు ఈ ప్రదేశంలో ఉన్న మసీదు మీనార్లు ఊగడం విశేషం.




మీనార్లను చేతితో కదిలించినా ఊగడం విశేషం. ఇటువంటి మసీదు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో వుంది. దీన్ని రాజ్‌బీబీ మస్జిద్ అంటారు. దీనికి రెండు మీనార్లు ఉన్నాయి. బలిష్టమైన రాతితో పటిష్టంగా దీన్ని నిర్మించారు. ఒక మీనారును మనం ఊపితే రెండవ మీనార్ కదులుతుంది. ఇది అలనాటి ఇంజినీర్ల ప్రతిభకు నిదర్శనం. నేటి ఇంజినీర్లకు సైతం తెలియని రహస్యంగా మిగిలాయి, రెండు ప్రాంతాలలోని ఊగే మీనార్ల మసీదులు. ఆధునిక ఇంజినీరింగ్ టెక్నాలజీకి సైతం ఈ వింత సవాలు విసురుతుంది. దీని రహస్యం అర్థం కావడం లేదు. ఉన్నత పాఠశాల వద్ద దో మీనార్ పేరుతో మరో రెండు మీనార్లు ఉన్నాయి. ఈ మీనార్లు ఎక్కడానికి లోపలి నుండి మెట్లు ఉన్నాయి. ఇది ముస్లింలు పండగ రోజుల్లో ప్రార్థన చేసే ఈద్గా. దీనిని బహమనీ సుల్తానులు నిర్మించారు. కరీంనగర్-వేములవాడ రహదారిలో ఎలగందల్ కోట నుండి మానకొండూర్ వరకు 9 కి.మీ.ల రహస్య సొరంగం ఉందని నమ్ముతారు. అసఫ్జాహీల కాలంలో కరీంనగర్ నుండి కామారెడ్డి కోట వరకు ఈ సొరంగం మార్గం నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడ ముఖ్యంగా రహస్య గదులు, మెట్ల బావులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

## ఛాయా సోమేశ్వరాలయం

ఛాయా సోమేశ్వరాలయం నల్లగొండ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పానగల్లు గ్రామంలో ఉంది.

ఈ దేవాలయానికి రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. గర్భగుడిలో శివలింగం, దాని వెనుకనున్న గోడపై సూర్యరశ్మితో సంబంధం లేకుండా ఎప్పటికీ కదలకుండా ఒకే స్థానంలో ఉన్నట్లుగా కనపడే స్తంభాకార నీడ(ఛాయ) పడటం ఇక్కడి విశేషం. రెండోది ఇక్కడికి చేరువలో ఉన్న చెరువులో నీళ్లు ఉన్నప్పుడు గర్భగుడిలో కూడా నీరు ఉబికి రావడం ప్రత్యేకత. ఆ జలంతో స్వామివారికి అభిషేకం చేస్తారు. 12వ శతాబ్దంలో కందూరు చోళ రాజులలో ఒకరైన ఏడవ మహారాజు పానగల్లును రాజధానిగా చేసుకొని పాలిస్తున్న కాలంలో ఆలయాన్ని నిర్మించినట్లు నాటి శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయంలో మొత్తం మూడు గర్భాలయాలున్నాయి. ఆ కారణంగా దీన్ని త్రికూటాలయం అని పిలుస్తారు.

ఈ దేవాలయంలో లభించిన ఒక శాసనంలో క్రీ.శ.1290 కాకతీయ ప్రభుత్వ ప్రతాపరుద్రుని పేరు ఉంది. ఆలయంలో కాకతీయుల కాలంనాటి శిల్పకళారీతులను చూడవచ్చు. తూర్పు ముఖంగా ఉన్న గర్భగుడిలో మాత్రమే శివలింగం, దాని వెనుకనున్న గోడపై స్తంభాకారంలో నీడ పడుతుంది. సూర్యునితో సంబంధం లేకుండా పగటివేళ వెలుతురుకు స్తంభంనీడ పడేలా ఈ ఆలయ శిల్పి రూపొందించారని కొందరు భావిస్తున్నారు. నీడ పడే గుడికి దక్షిణం వైపు ప్రధాన ద్వారం ఉంటుంది. తూర్పు,



పడమర, ఉత్తరం వైపు మూడు గర్భగుడులు ఉంటాయి. పడమర వైపు ఉన్న గర్భగుడిలోని శివలింగంపైనే నీడ పడుతుంది. మిగిలిన రెండు గుళ్లలో అంతా చీకటిగా ఉంటుంది. మధ్యలో నాలుగు స్తంభాలుంటాయి. ఏ గర్భగుడివైపు చూసినా వాటి నిర్మాణం ఒకేలా ఉంటుంది. ఇక్కడి శివలింగం, దాని వెనుక గోడపై స్తంభంపై పడే నీడ ఎప్పుడూ స్థిరంగానే ఉంటుంది. గర్భగుడి ముఖద్వారం ముందు రెండు స్తంభాలున్నాయి. అన్ని వేళలా నీడ పడుతుంది. అది వెలుతురు ఉన్నంతసేపు కదలకుండా ఒకే స్థానంలో ఉంటుంది. సూర్యుని గమనంలో మార్పు ఆ నీడను మార్చదు. ఆ నీడ ఎలా పడుతుంది, ఎందుకు అది వెలుతురులో ఉన్నంతవరకూ తన స్థానాన్ని మార్చుకోదు, అది ఎక్కడి నుంచి పడుతుందో? ఎవరికీ తెలియదు. గుళ్లోని శివలింగంపై పడే నీడ ఉదయం అయినా, మధ్యాహ్నం అయినా ఎప్పుడూ కదలదు. ఇంకో విషయం ఏమిటంటే ఆ నీడ ఒక స్తంభం నీడలా కనిపిస్తుంది. ఆ గుళ్లో ఎనిమిది స్తంభాలుంటాయి. కానీ ఆ నీడ ఏ స్తంభానిదో ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే ఒక స్తంభం నీడ అని మనం అనుకుంటే- దాని నీడ పడినప్పుడు దాన్ని ముట్టుకుంటే మన చేయి నీడ కూడా పడాలి కదా! అలా పడదు. అయితే ఈ నీడ ఎక్కడి నుండి పడుతోంది? రోజంతా స్థిరంగా ఎలా ఉంటోంది? అనే విషయమై మన దేశంతో పాటు పలుదేశాల శాస్త్రవేత్తలు ఈ ఆలయాన్ని సందర్శించి వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు తప్ప ఈ నీడ ఎందుకు పడుతుందనే విషయాన్ని కచ్చితంగా వివరించలేకపోయారు.

### ఐదు ఓట్లు

పార్టీవాళ్లు: ఏమ్మా, మీ ఇంట్లో ఎన్ని ఓట్లున్నాయి?

గృహిణి: నాది, మా ఆయనది, మా అత్తయ్య, మామయ్య, మా అబ్బాయిది. మొత్తం ఐదు. ఇదిగోండి అందరి ఓటరు కార్డులు.

పార్టీవాళ్లు: ఇదిగోండి.. పదహేను వేలు. మాకే ఓటేయండమ్మ. మా గుర్తు మరిచిపోకండమ్మా.

పార్టీలో ఒకరు: అయ్యో, ఆమెవరో తెలుసా? స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చంద్రం గారి భార్య.

### డిపాజిట్

భార్య: ఏమండీ, మన డిపాజిట్ వచ్చేసిందండీ!

భర్త: ఇంకా ఓటింగే కాలేదు. మనం గెలుస్తామో లేదో తెలీదు. అప్పుడే డిపాజిట్ ఎలా వచ్చింది?

భార్య: సాయంత్రం అవతలి పార్టీవాళ్లు మన ఇంటికొచ్చి మీ ఇంట్లో ఎన్ని ఓట్లు వున్నాయని అడిగారండీ. వెంటనే నేను ఐదు ఓట్లు వున్నాయని చెప్పాను. వెంటనే ఓటుకు మూడు వేల చొప్పున ఐదు ఓట్లకు పదిహేను వేలిచ్చారండి.

**- సంపంగివారి జయచంద్రారెడ్డి,**
బాపట్ల

### ఫీజు కడతాను

తల్లి: నవ్యా, నిన్ను చదివించడానికి డబ్బులు చాలా ఖర్చయ్యాయి. అందుకని నీ జీతం నాకు ఇవ్వాలి.

నవ్య: కుదరదు మమ్మీ. కావాలంటే నువ్వు చదువుకో, ఫీజు నేను కడతాను.



### ఇంట్లో ఏమీ చేయరు

"ఎందుకు కోపంగా వున్నావు?" రాజకీయ నాయకుడు అడిగాడు భార్యను.

"మీరు బయట టీ చేసారు, బట్టలు ఇస్త్రీ చేసారు, చెప్పులు కుట్టారు. ఇంట్లో మాత్రం ఏమీ చేయరు" అందుకని నాకు కోపం వచ్చింది.

### దాచేసాను..

విజ్జి: ఇక్కడ కరాటే నేర్చుకోవడం ఎలా అనే పుస్తకం ఉండాలి.. ఏది?

తండ్రి: "మీ అమ్మ కరాటే పుస్తకం చదువుతుందేమోనని దాచేసాను".

### తరువాతి జన్మలో..

అనిల్: ఇంకో ఏడు జన్మలకి నువ్వే నా భార్యవి.

అర్చన: ఔనా. అయితే ఆ తర్వాత ఇంకెవరినో చేసుకుంటావా?

**- ఈ.ఎస్.మాధవన్**

# ఎన్ని ద్వారాలు ఉండాలి?


వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458




ఒక ఇంటిని కట్టేముందు పరిపూర్ణమయిన ప్లాను ముందుగా సిద్ధం చేసుకోవాలి. ద్వారాలు, కిటికీలు, అలమారలు అన్నింటినీ ప్లానులో ముందే స్థిరపరచుకోవాలి.

ప్లాను వేసుకునేటప్పుడు కూడా వీలునుబట్టి కానీ, అభిరుచిని బట్టి కానీ ఇష్టం వచ్చినట్టు తలుపులు, కిటికీలు, అలమారలు, గదులు మొదలయినవి ఏర్పాటు చేసుకోవటం మంచిది కాదు.

వాస్తు బాగా తెలిసిన వ్యక్తుల సలహా సంప్రదింపులు తీసుకోవటం మంచిది. మోజుపడి చిత్తం వచ్చినట్లు గృహ నిర్మాణం చేసుకుంటే చివరకు బూజే మిగులుతుందనడంలో అతిశయోక్తి లేదు.

ఇంటికి ద్వారాలుగానీ, కిటికీలుగానీ, అలమారలుగానీ సరిసంఖ్యలో వుండాలి. రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది.. ఇలా అయితే సున్నా '0' తో అంతమయ్యే సంఖ్య కూడా సరిసంఖ్యనే. కానీ తలుపులు 10, 20, 30.. ఇలా వుండకూడదు.

ద్వారాలయినా, కిటికీలయినా, అలమారలయినా ఒకదానికొకటి ఎదురెదురుగా వుండాలి. మూడు ద్వారాలు వరుసగా ఎదురెదురుగా వుండకూడదు. అంటే వరుసగా మూడు ద్వారాలు అమర్చకూడదు. నాలుగు ద్వారాలు వరుసగా వుండకూడదు.

ద్వారాన్ని పూర్తిగా గోడకుగానీ, పిల్లర్‌కుగానీ ఆనించి నిర్మించకూడదు. అధమం నాలుగయిదు అంగుళాలు అయినా తలుపుకు, గోడకుగానీ పిల్లర్‌కుగానీ మొత్త(చిన్న గోడ) వుంచాలి. అంటే గోడకు ద్వారానికి ఆమాత్రం స్థలాన్ని విడిచి ద్వారం నిర్మించాలి. ద్వారానికి ప్రధాన గోడకూ మధ్య తలుపు పట్టే చిన్న గోడ ఉండాలి.

ఒక గృహానికి వున్న ద్వారాలు ఆ గృహానికి మాత్రమే పరిమితమవుతాయి. గృహానికి బయట కాంపౌండు లోపల వేరుగా నిర్మించిన ఏ కట్టడాలయినా వేరుగా పరిగణించాల్సి ఉంటుంది.



ప్రధాన గృహానికి బయట టాయిలెట్స్, బాత్‌రూమ్స్ వుంటే వాటి తలుపుల సంఖ్య వాటికే పరిమితం, కానీ ప్రధాన గృహంలోని తలుపుల సంఖ్యతో కలుపకూడదు.

వేటికవే ప్రత్యేకంగా సరి సంఖ్యలో వుండేట్టు జాగ్రత్త పడాలి. గృహంలో ద్వారాలను అమర్చుకునేటప్పుడు ఇంట్లో కట్టే 'కమాన్'లుగానీ, 'గ్రిల్' తలుపులు గానీ ద్వారాల లెక్కలోకి రావు. ఇంటి పైకప్పును తాకకుండా వుండే తలుపులు సాధారణంగా లెట్రిన్స్‌కు, బాత్‌రూమ్సుకూ వుంటుంటాయి. పైకప్పును తాకని ద్వారాలు కూడా ద్వారాలుగా లెక్కలోకి రావు.

పూజాగదులు నిర్మించుకునేవాళ్లు ఓ మూల దాన్ని ప్రత్యేకంగా చిన్నవిగా నిర్మించుకుని పైకప్పుకు తాకని తలుపులనుగానీ, గ్రిల్ తలుపునుగానీ, కమాన్‌నిగానీ నిర్మించుకుంటారు. అలాంటివి కూడా ద్వారాల లెక్కలోకి రావు.

ప్రహరీ గోడలకు తాకకుండా మధ్యలో ఇల్లు కట్టినా, ప్రహరీ గోడలనూ ఆనుకొని ఇల్లు కట్టి ఉత్తరం వైపుగానీ, తూర్పు వైపుగానీ ఒకే వైపు ఖాళీస్థలం వదిలి అక్కడ మెయిన్ గేటు కట్టుకున్నా ఆ మెయిన్ గేట్‌ని ఇంటి ద్వారాల సంఖ్యలో కలపకూడదు.

ప్రహరీనో, సర్వెంట్ క్వార్టర్స్, స్టోర్ రూములు మొదలయినవి కట్టినప్పటికీ వాటి ద్వారాలు సరి సంఖ్యలో వుండేట్లు చూసుకోవాలి. ఉదా: ఇంట్లో ఏడు ద్వారాలుంటే బయట కట్టిన స్టోర్ రూమ్‌కి ఒక ద్వారం కట్టి మొత్తం ఎనిమిది ద్వారాలు అయ్యాయి అని సరిపెట్టుకోవటం పొరపాటు. ఇంటికి ఆరు, స్టోర్ రూమ్‌కి రెండు ద్వారాలుంటే వేటికవి సరిసంఖ్యలా సరిపోతాయి. అయితే ద్వారాలు మాత్రమే సరి సంఖ్యలో వుంటే వాస్తుదోషాలు లేవనుకోవటం పొరపాటు. గృహానికి నాలుగు వైపులా వుండే ఖాళీ స్థలాల గురించి శ్రద్ధ తీసుకోవాలి. పడమర కంటే తూర్పుకు; దక్షిణం కంటే ఉత్తరానికి ఎక్కువ ఖాళీస్థలం వుండాలి.

---

## ఇల్లు అమ్మమంటారా?

పి.కార్తికేయ - మోపిదేవి

**ప్రశ్న: మీరు సూచించిన మార్పులు చేసాం. ఇప్పుడు మా ఇంటిని అమ్మమంటారా? మాకు కొన్ని అప్పులు వున్నాయి. సంపాదనంతా వడ్డీలు కట్టటానికే సరిపోతోంది.**

**జవాబు:** మీరు మార్పులు సంపూర్ణంగా చేయలేదు. వాయవ్యంలో వున్న లెట్రిన్, సెప్టిక్ ట్యాంక్, బాత్ రూమ్‌లు అక్కడ వుండకూడదు. కట్టవలసిన పద్ధతి కూడా అలా కాక యింటికి, ఉత్తర వాయవ్య గోడకు తగలకుండా పశ్చిమ గోడకు ఆనుకుని వుండవచ్చు. వాటికీ ఇంటికీ మధ్యలో వుండే ఖాళీ స్థలం కంటే- వాటికీ ఉత్తర కాంపౌండ్ గోడకూ మధ్యన ఖాళీ స్థలం ఎక్కువగా వుండాలి. మీకు దక్షిణ సరిహద్దును ఆనుకుని యింకా కొన్ని దుకాణాలు కట్టవచ్చు. అప్పుడు మీకున్న స్థలంలో, దక్షిణ పశ్చిమాల్లో నిర్మాణం జరిగి, ఉత్తర తూర్పుల్లో ఖాళీ స్థలం ఏర్పడి, నిర్మాణం 'ఎల్' ఆకారంలో వుండటం వలన మీకు చాలా మంచి ఫలితాలు కలుగుతాయి.

ఈ ఇంటిని అమ్మటం వలన అదనంగా కష్టానష్టాలు ఏమీ రావు. కానీ రావలసిన మంచి ఫలితాలు మీరు వదులుకున్నవాళ్లవుతారు.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



గృహ సమస్యల నుండి బయట పడతారు. స్నేహ ఒప్పందాలు బలపడతాయి. వృత్తి సంబంధమైన అభివృద్ధిలో ఆటంకాలు తొలగిపోతాయి. వెన్నునొప్పి బాధించే సూచనలు ఉన్నాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. భవిష్యత్తు గురించి ఆలోచనలు సాగిస్తారు. సమిష్టి నిర్ణయాలు తీసుకుంటారు. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

## వృషభం



వివాదాలకు, విభేదాలకు దూరంగా ఉండండి. ఆర్థిక వ్యవహారాలలో లోటుపాట్లు తప్పకపోవచ్చు. బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు. పాత బాకీలు వసూలవుతాయి. మీకు ఎంతమాత్రమూ సంబంధం లేని విషయాల పైన ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. రాజకీయాల పట్ల మక్కువ ఏర్పడుతుంది. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి.

## మిథునం



విపరీతమైన పని ఒత్తిడి వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. అకారణంగా ఒక మిత్రుడితో విరోధం రాకుండా ముందు జాగ్రత్త వహించండి. దైవానుగ్రహం అన్ని వేళలా మీకు అండగా ఉంటుంది. ధన వ్యయం అధికంగా ఉంటుంది. వ్యాపారస్తులకు అనుకూలం. జీవితాన్ని కొత్త కోణంలో చూస్తారు. చిన్నపాటి ప్రయాణాలు చేస్తారు.

## కర్కాటకం



ధైర్యంతో తీసుకున్న ఒక నిర్ణయం సరికొత్త మలుపుకు దారి తీస్తుంది. దైవ దర్శనం చేసుకుంటారు. కనిపించని కృతజ్ఞత కోసం ఎదురు చూసి నిరాశ పడతారు. స్థిరాస్తులకు సంబంధించిన అంశాలు సానుకూలపడతాయి. రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. ప్రచారంలో వున్న పుకార్లను నమ్ముతారు. ముఖ్యమైన కార్యక్రమాలను నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు.

## సింహం



మీ పరిజ్ఞానానికి ప్రశంసలు లభిస్తాయి. కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారానికి, ఉద్యోగానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. సాంకేతిక కారణాల వల్ల అపార్థాలు చోటు చేసుకుంటాయి. బాల్య మిత్రులను కలుసుకుంటారు. ఇంటా బయటా అనుకూలం. వివాదాలకు దూరంగా ఉంటే మంచిది.

## కన్య



మాట తొందరపాటు మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేసే సూచనలు ఉన్నాయి, జాగ్రత్త వహించండి. సంస్థలో మీ సహచరుల సహకారంతో కొన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పూజలలో ఆరావళి కుంకుమ ఉపయోగించండి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. కొనుగోలు, అమ్మకాల వల్ల లాభపడతారు. సమయోచితంగా వ్యవహరిస్తారు.

## తుల



మీ తెలివితేటలు, నైపుణ్యం ప్రదర్శించటానికి ఒక చక్కని అవకాశం లభిస్తుంది, నేర్పుగా ఉపయోగించుకోండి. అమ్మకాలు, కొనుగోళ్ల విషయంలో జాగ్రత్త వహించండి. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి, ఉద్యోగాల పరంగా కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. ఆహార, ఆరోగ్య నియమాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. పక్షులకి నీళ్ల పెట్టండి. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి.

## వృశ్చికం



ప్రశాంతంగా ఆలోచించి కొన్ని నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఆర్థికంగా లాభపడతారు. రహస్య శత్రువులు వెలుగులోకి వస్తారు. నరఘోష అధికంగా ఉంటుంది. శుభ వార్తలు వింటారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఆలోచింపచేస్తాయి. సుదీర్ఘమైన ఫోన్ సంభాషణలు సాగిస్తారు. ఆప్తులెవరో, మిత్రులెవరో తెలుసుకుంటారు. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి.

## ధనుస్సు



ఇతరులను మెప్పించి మీ పనులు సానుకూలపరచుకుంటారు. అదృష్టం కలిసి వస్తుంది. ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. గతంలో దూరమైన ఒక వర్గంతో తిరిగి సఖ్యత ఏర్పడుతుంది. గుప్తదానం చేస్తారు. వివాదాలకు వీలైనంత దూరంగా వుండడం మంచిది. ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తారు. పక్షులకి నీళ్ల పెట్టండి. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయడం శుభప్రదం.

## మకరం



కార్యాలయంలో నూతనోత్సాహంతో శ్రమించి మంచి ఫలితాలు సాధిస్తారు. సాంకేతిక లోపాల వల్ల మీకు అందవలసిన సమాచారం సకాలంలో మీకు చేరకపోవచ్చు. గోశాలలో గరిక దానం చేయండి. దురభ్యాసాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంటారు. వివాదాలలోకి మిమ్మల్ని లాగాలని ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు విఫలమవుతాయి. విదేశీ వ్యవహారాలు లాభిస్తాయి. రాజకీయ పైరవీలు జరుగుతాయి.

## కుంభం




వృత్తి, ఉద్యోగ, వ్యాపార సంబంధమైన విషయాలు అనుకూలంగా ఉంటాయి. ఆరోగ్య సమస్యలు ఉంటాయి. ఒక ప్రయాణం మీకు అనుకూలంగా ఉంటుంది. శుభ వార్తలు వింటారు. మానసిక ఒత్తిడి నుండి బయట పడతారు. ఆదాయ, వ్యయాలలో సమతుల్యతను సాధిస్తారు. క్రీడారంగంలోని వారికి అనుకూలం. మీ ప్రణాళికలు, కార్యాచరణ సత్ఫలితాలనిస్తాయి.


## మీనం




ఆర్థికంగా బాగుంటుంది. ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. ఎదురు చూడని అవకాశాలు కలిసి వస్తాయి. పూజలలో ఆరావళి కుంకుమ ఉపయోగించండి. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. సంతానానికి సంగీత, సాహిత్యాలలో ప్రవేశం కల్పించాలని నిశ్చయించుకుంటారు. రాజకీయాల పట్ల ఆసక్తి చూపిస్తారు. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయడం శుభప్రదం.

# ఈ వారం 'కార్టూన్స్'


మీ ఆవిడని చూడ్డానికే.. గానీ ఇలా రోజూ యూనిఫాం లో రాకండి సర్.. ప్లీజ్!!
FEMALE WARD
Zakir...


టైర్డా? రిటైర్డా..?!
Zakir...


నాయకులందరి ప్రసంగాలు, ప్రచారాలు చూసారు..
బెస్ట్ 'యాక్టర్' అవార్డు ఎవరికి ఇవ్వొచ్చు..!?
Zakir...



హృదయాకారంలో వున్న ఈ సరస్సును ఎరోస్ లేక్ అని పిలుస్తారు. కేరళలోని చెంబ్రా పర్వతంపై వుందీ లేక్. ట్రెక్కింగ్ ద్వారా పర్వతం పైకి చేరుకుంటే సరస్సు అందాలను చూడవచ్చు. స్థానికులు దీనిని హృదయ సరస్సు అని అంటారు.

